RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 80 పేజీలు - 08 సోమవారం 16 ఫిబ్రవరి 2026

## గవర్నర్‌ను దూషించిన డీఎంకే నేత.. మూడేళ్ల జైలుశిక్ష వేసిన కోర్టు

**తొలి అక్షరం/తమిళనాడు ,ఫిబ్రవరి15:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది.కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.







## మా ప్రభుత్వం నుంచి సంక్షేమం
# ఆశించకండి

● ప్రభుత్వ పథకాలు, సాయంపై ఆశ పెట్టుకోవద్దు ● భూముల కోసం దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దు ● మీకిచ్చేందుకు ప్రభుత్వం దగ్గర ఎలాంటి భూముల్లేవు ● సేవాలాల్ జయంతి వేడుకల్లో తేల్చిచెప్పిన రేవంత్ ● పురపోరు పూర్తవగానే చేతులెత్తేసేలా వ్యాఖ్యలు


**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారు. పథకాలపై ఆశ పెట్టుకోవద్దని, సంక్షేమ శకం ముగిసిందని చెప్పారు. ప్రభుత్వం సాయం చేస్తుందని దళిత, గిరిజనులు ఎదురుచూడొద్దని కరాకండిగా తేల్చిచెప్పారు. ఉన్నత చదువులు చదువుకోవాలని, అందుకు ఎంతడిగినా సాయం అందిస్తామని వివరించారు. ఆదివారం ఉదయం బంజారాభవన్‌లో ఏర్పాటుచేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలకు గిరిజన శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.'ఒకప్పుడు ఇందిరాగాంధీ హయాంలో సీలింగ్ యాక్ట్ ప్రకారం భూములను తీసుకొని అసైన్‌మెంట్ పట్టాల రూపంలో పంచారు. ఇప్పుడు పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవు. దళితులకు, గిరిజనులకు నాది ఒక్కటే సూచన. ఆనాడున్న పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విధానం తీసుకున్నది. కానీ నేడు ఆ శకం ముగిసింది. ఇవ్వాళ భూములు ఇవ్వాలన్నా మిగతా2లో...

## నేడు ఏపీలో పర్యటించనున్న బిల్ గేట్స్



**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించను న్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్య టనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చం ద్రబాబు, ఉప ముఖ్యమంత్రి మిగతా2లో...

## ఓం బిర్లాపై అవిశ్వాస
# తీర్మాన చర్చ మార్చి 9న




**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ, తదుపరి ఓటింగ్ మార్చి 9న జరుగుతుందని, విరామం తర్వాత సభ తిరిగి సమావేశమవుతుందని కేంద్రపార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం.. బడ్జెట్ సెషన్ రెండవ దశ మార్చి 9 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుందని అన్నారు. పలు ముఖ్యమైన చట్టాలు, క్లిష్టమైన బిల్లులపై పార్లమెంటులో చర్చ, ఆమోదం కోసం సమర్పించనున్నట్లు తెలిపారు. మార్చి 9న లోక్‌సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అవిశ్వాస తీర్మానంపై చర్చ మిగతా2లో...

## ఈనెలలోనే రెండు
# అల్పపీడనాలు..

నేడు, 19 తర్వాత ఏర్పడే అవకాశం

25 నుంచి 28 వరకు వర్షాలు

వెల్లడించిన వాతావరణ శాఖ




# రైతులకు ద్రోహమే...

వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తుంది

ఇది అన్నదాతల భవిష్యత్తుకు సంబంధించిన విషయం

కేంద్రం తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ప్రధానికి ఐదు ప్రశ్నలు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ ఫిబ్రవరి 15:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోసపోవడాన్ని కండ్లారా చూస్తున్నామనీ, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదనీ, రైతుల భవిష్యత్తుకు సంబంధిం చిందన్న ఆయన.. ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. "డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (డీడీజీ) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి చేసి న (జీఎం) అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన మిగతా2లో...



## హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో

మిగతా2లో...

## సూపర్8.. పాక్‌పై
# భారత్ ఎనిమిదో విజయం

ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు ఇషాన్ కిషన్ విజృంభణ

బౌలర్ల సమష్టి ప్రదర్శన టీమ్‌ఇండియాకు సూపర్-8 బెర్తు



టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్‌ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది. కొలంబో గడ్డ మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పోరాడే స్కోరు అందుకున్న టీమ్‌ఇండియా సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికిఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరిపించింది. హ్యాట్రిక్ విజయాలతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టాప్ గేర్‌లో దూసుకెళుతుండగా, పాక్ సూపర్-8 ఆశలు మిణుకుమిణుకుమంటున్నాయి.




## ఒక మున్సిపాల్టీ గెలిస్తే దాన్ని లాక్కుంటారా?

- బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు తప్పదు : కల్వకుంట్ల కవిత

**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మున్సిపల్ ఎన్నికల్లో తాము ఒక మున్సిపాల్టీని గెలిస్తే ఆ ఒక్క సీటును కాంగ్రెస్ లాక్కుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం, అడిగేవారు ఉండకూడదా? అని ఆమె మిగతా2లో...

## శివనామస్మరణతో మారుమోగుతున్న
# పుణ్యక్షేత్రాలు..



**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర నదులు, కోనేర్లలో స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం భక్తులకు కనుల విందుగా నిలిచింది. **శ్రీశైలంలో ప్రభోత్సవం - నందివాహన సేవ:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధిలో గంగాధర మండపం వద్ద అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభోత్సవాన్ని ప్రారంభిం చారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రభపై

మిగతా2లో...

## కేరళ సీఎంగా మళ్లీ విజయనే...

- కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మణిశంకర్ అయ్యర్ ఆశాభావం



# మా ప్రభుత్వం నుంచి సంక్షేమం ఆశించకండి

(మొదటి పేజీ తరువాయి)

మా దగ్గర అందుబాటులో లేవు. ఇక భూముల గురించి, ప్రభుత్వమిచ్చే సంక్షేమం గురించి ఆలోచించవద్దు. మేం ఏం చేయం, మాకు భూమివ్వండి? చిన్నవ్యాపారాలు చేసుకుంటామనేది వదిలిపెట్టండి. తాత్కాలిక సంక్షేమం గురించి ఆలోచించవద్దు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.అయితే గిరిజన బిడ్డలు ఎంతరవరకు చదువుకుంటారో చదువుకోవాలని, అందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఉచిత సలహా ఇచ్చారు. ఆ తర్వాత ఉచిత సన్నబియ్యం, ఉచిత బస్సు, సబ్సిడీ విద్యుత్ పథకాలు, యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర వాటి గురించి ఏకరువు పెట్టారు. సేవాలాల్ బోధనలు, సామాజిక ఐక్యతకు చేసిన కృషిని కొనియాడారు. తన రాజకీయ ప్రస్థానంలో లంబాడా గిరిజనుల పాత్ర ఎంతో ఉన్నదని, వారి రుణం తీర్చుకునే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ప్రతీ తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంప్‌సెట్లు, పాఠశాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, తాగునీరు, విద్యుత్ మౌలిక వసతులను కల్పించాలని ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. **వచ్చే ఏడాది అచ్చంపేటలో వేడుకలు** రాష్ట్రంలో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు అచ్చంపేట అటవీ ప్రాంతంలో 20 ఎకరాలు సేకరించామని, వచ్చే ఏడాది అకడే వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సేవాలాల్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీలు బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్,అదనపు సంచాలకులు సర్వేశ్వరరెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు వేమూరి సముజ్వల, చీఫ్ ఇంజినీర్ బాలునాయక్, జీసీసీ జీఎం ప్రతాప్‌రెడ్డి, గిరిజన మ్యూజియం క్యురేటర్ ద్యావనపల్లి సత్యనారాయణతో పాటు ఉన్నతాధికారులు, లంబాడా కళాకారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమోగుతున్న పుణ్యక్షేత్రాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆదిదంపతులు ఊరేగుతుండగా, భక్తులు శివనామ స్మరణతో పులకించిపోయారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు నందివాహన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందివాహనంపై కొలువుదీరిన స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ 'ఓం నమః శివాయ' మంత్రంతో మారుమోగిపోయాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.**ఏలూరు జిల్లా కైకలూరులో..** కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో వెలసిన శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కలిదిండి శివనామస్మరణతో మారుమోగుతోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల జాగారం కోసం దేవస్థానం కమిటీ భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అలాగే, కోనేరు వద్ద భక్తులు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు (పితృతర్పణం) నిర్వహించారు.అనంతపురంలో 18 వేల బాన లింగాలకు అభిషేకం..అనంతపురంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన శివ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉజ్జయినిలోని నర్మదా నది నుండి సేకరించిన 18,000 బాన లింగాలను ఇక్కడ ప్రతిష్టించారు. భక్తులందరికీ ఈ లింగాలకు అభిషేకం చేసుకునే అరుదైన అవకాశాన్ని కల్పించారు.ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు బాన లింగంతో పాటు అభిషేకం కిట్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అరుణాచలం నుండి తీసుకొచ్చిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు రేపు ఉదయం వరకూ కళ్యాణోత్సవం, రుద్ర హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.**శ్రీ సత్యసాయి జిల్లాలో..** ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిమ్మమ్మ మర్రిమాను క్షేత్రంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇక్కడ ఉన్న శివాలయంలో భక్తుల జాగారం కోసం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేశారు. మర్రిమాను నీడలో వేలాది మంది భక్తులు జాగారం చేస్తున్నారు. అన్ని క్షేత్రాల్లోనూ తొక్కిసలాట జరగకుండా వాలంటీర్ వ్యవస్థ, పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# కేరళ సీఎంగా మళ్లీ విజయనే...

**తొలి అక్షరం/తిరువనంతపురం ఫిబ్రవరి 15:** కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ కొనసాగుతారని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ విశ్వాసం వ్యక్తం చేశారు."విజన్ 2031: డెవలప్‌మెంట్ అండ్ డెమోక్రసీ" అనే అంతర్జాతీయ సెమినార్‌ను ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సమక్షంలో పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేయడంలో కేరళ అగ్రగామి స్థానాన్ని చట్టబద్ధంగా కాపాడుకోవడానికి అవసరమైన సవరణలు ప్రతిపాదించబడుతున్నాయని అయ్యర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారతదేశం పట్ల మహాత్మా గాంధీ దార్శనికతను గుర్తుచేసుకుంటూ, పేద పౌరులు కూడా యాజమాన్య భావాన్ని అనుభవించి, దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనే దేశం గురించి గాంధీజీ కలలు కన్నారని అయ్యర్ అన్నారు.ఈ ఆదర్శం వైపు అత్యంత ప్రశంసనీయమైన పురోగతి కేరళలోని వామపక్షాల పాలనలో సాధించబడిందని ఆయన గుర్తుచేశారు. వికేంద్రీకృత పాలనలో కేరళ సాధించిన విజయాలను అయ్యర్ హైలైట్ చేశారు. కేరళను ప్రజాస్వామ్యంలో దేశం యొక్క ఆచరణాత్మక నాయకుడిగా అభివర్ణించారు. స్థానిక స్వపరిపాలన పట్ల దశాబ్దాలుగా రాజకీయ నిబద్ధత చూపడం ద్వారా కమ్యూనిటీలకు సాధికారత కల్పించడం , సామాజిక ఫలితాలను మెరుగుపరచడం జరిగిందని ఆయన ప్రశంసించారు. కేరళ పనితీరు అనేక సందర్భాల్లో జాతీయ అంచనాలను మించిపోయిందని ఆయన పేర్కొన్నారు. **మణిశంకర్ అయ్యర్ ప్రసంగ పూర్తిపాఠం..** భారతదేశం కోసం తన కల గురించి 1931లో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, మహాత్మా గాంధీ ఇలా అన్నారు. "పేదలు కూడా తమ దేశం అని భావించే భారతదేశం కోసం నేను పని చేస్తాను, దాని నిర్మాణంలో వారికి ప్రభావవంతమైన స్వరం ఉంటుంది." మార్క్సిస్ట్ పార్టీ పాలనలో ఉన్న కేరళ, ఈ ప్రకటిత గాంధీ లక్ష్యం వైపు నిజమైన పురోగతి సాధించిన భారతదేశంలోని ఏకైక రాష్ట్రం అని మణి శంకర్ అయ్యర్ అన్నారు.

అయితే, ఈ సందర్భం జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్‌కు చెందిన తన సహచరులు హాజరు కాకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. సమయ పరిమితిని దృష్టిలో ఉంచుకుని, తాను నేరుగా ప్రధాన సమస్య కు వెళ్తానని ఆయన అన్నారు. మూడు అంచెల పంచాయతీ రాజ్ పాలన సాధనలో కేరళ దేశంలో మొదటి స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. మనతో ఇప్పుడు లేని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆలోచనలు కేరళలో మరే ఇతర రాష్ట్రంలో కంటే సమర్థవంతంగా అమలు చేయబడ్డాయి.అయితే, అమలులో కేరళ మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, చట్టం పరంగా అది రెండవ స్థానంలో ఉందని ఆయన ఎత్తి చూపారు. కేరళకు తన మునుపటి పర్యటనను గుర్తుచేసుకుంటూ, అప్పుడు తాను ఒక నిర్దిష్ట అభ్యర్థన చేశానని చెప్పారు. రమేశ్ కుమార్ కమిటీ నివేదిక ఆధారంగా, కర్నాటక అత్యంత ప్రగతిశీల , ఆధునిక పంచాయతీ రాజ్ చట్టాన్ని రూపొందించింది. దీనిలో కమిటీ సభ్యుడిగా తాను ప్రతిపాదించిన 38 సవరణలను కూడా చేర్చారు. పంచాయతీ రాజ్ మార్గదర్శకుడిగా విస్తృతంగా పరిగణించబడుతున్న నేటి కార్యక్రమంలో పాల్గొన్న వి.కె. రామ చంద్రన్ ఈ రంగంలో నిజమైన "గురువు" అని ఆయన అన్నారు. థామస్ ఐజాక్‌కు క్షమాపణలు చెబుతూ, ఈ రంగంలో రామచంద్రన్ ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. కేరళలోని అప్పటి స్థానిక స్వపరిపాలన మంత్రి ఈ సూచనలను అంగీకరించారు . ఆయన సిఫారసు చేసినట్టుగా కర్నాటక , కేరళ రెండింటి నుంచి నిపుణులు కమిటీలో పాల్గొన్నారు.కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా పినరయి విజయనే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి సమక్షంలో తన విజ్ఞప్తిని మణిశంకర్ అయ్యర్ పునరుద్ఘాటించారు. పంచాయతీ రాజ్‌లో కేరళ నంబర్ వన్ స్థానాన్ని ధృఢంగా భద్రపరచడానికి, కేరళ సొంత అనుభవాలు, థామస్ ఐజాక్ అంతర్దృష్టులు , ఆయన అధ్యక్షత వహించిన ఐదు సంపుటాల నివేదిక ఆధారంగా శాసన సవరణలు తీసుకురావాలని ఆయన రాష్ట్రాన్ని కోరారు. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రణాళికా సంఘం పంచాయతీ రాజ్‌ను నిజంగా విశ్వసించిన సమయంలో జిల్లా ప్రణాళికపై వి.కె. రామచంద్రన్ రూపొందించిన నోట్‌కు తగిన పరిశీలన ఇవ్వాలని ఆయన అన్నారు. నేడు దేశంలో పంచాయతీ రాజ్‌ను సమర్థించే స్వరాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అందువల్ల ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఆయన నేరుగా విజ్ఞప్తి చేశారు: "సర్, దయచేసి కాంగ్రెస్ వదిలిపెట్టిన లక్ష్యాన్ని చేపట్టండి." అన్నారు. తన ప్రసంగాన్ని ముగిస్తూ.. "ధన్యవాదాలు, కేరళ అభివృద్ధి చెందాలి."అని అన్నారు.

# మేడారం కోవా బన్ వివాదం.. వలీకి అండగా నిలిచిన నారా లోకేష్.. త్వరలోనే కలుస్తానని హామీ

**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:**మేడారం జాతరలో చోటుచేసుకున్న కోవా బన్ వివాదంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ స్పందించాడు. కర్నూలుకు చెందిన చిరువ్యాపారి వలీకి అండగా నిలుస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ నోట్ పెట్టాడు.అసలేం జరిగిందంటే? మేడారం జాతరలో కర్నూలు జిల్లా వెలుగుగోడు గ్రామానికి చెందిన షేక్ షావలీ అనే వ్యక్తి తన సోదరుడితో కలిసి కేవలం 10 రూపాయలకే కోవా బన్ విక్రయిస్తున్నారు. అయితే, వ్యూస్ మరియు లైక్స్ కోసం కొంతమంది యూట్యూబర్లు (తేజస్వి న్యూస్ ఛానల్) అతనిని చుట్టుముట్టి. ఆ ఆహారంలో ఏదో కలిపారంటూ, అది 'ఫుడ్ జిహాద్' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాకుండా.. ఆ ఆహారం సురక్షితమేనని నిరూపించడానికి వలీని అందరి ముందే దానిని తినాలని బలవంతం చేసి వేధించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకు అందరూ యూట్యూబర్ల తీరును తప్పుబట్టారు. తాజాగా ఇదే ఘటనపై నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ వలీకి అండగా నిలిచాడు."డియర్ బ్రదర్ వలీ, నీవు ఎదుర్కొన్న ఈ పరిస్థితికి నేను చాలా బాధపడుతున్నాను. ఇలాంటి విభజన రాజకీయాలకు,



వంతవరవైన వేధింపులకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మనది ఎప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం మరియు సోదర భావంతో విరాజిల్లే సమాజం. త్వరలోనే నేను నిన్ను కలుస్తాను. నీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూ స్తున్నాను. మనం అందరం కలిసి నిలబడదాం అంటూ నారా లోకేష్ రాసుకోచ్చాడు. కేవలం లోకేష్ మాత్రమే కాకుండా టీడీపీ నేతలు పరిటాల శ్రీరామ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, తదితరులు ఈ ఘటనపై స్పందించడమే కాకుండా వలీకి అండగా నిలిచారు.

# నేడు ఏపీలో పర్యటించనున్న బిల్ గేట్స్

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు.ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.

# ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మాన చర్చ మార్చి 9న

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని, పార్లమెంట్ నిబంధనల ప్రకారం తీర్మానంపై మొదటి రోజే చర్చ చేపట్టాలని అన్నారు. చర్చతోపాటు ఓటింగ్ నిర్వహిస్తామని అన్నారు. ప్రతిపక్షం సభ పనిచేసేందుకు అనుమతించకపోతే గిలెటిన్‌ను ప్రవేశపెడతామని, దాంతో వారికే నష్టమని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మాట్లాడేందుకు అనుమతించకపోవడంతో స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

# ఈనెలలోనే రెండు అల్పపీడనాలు..

**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:**ఆగ్నేయ బంగాళాఖాతం లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, శ్రీలంకలో వర్షా లు కురుస్తాయని పేర్కొన్నది. తెలంగాణ, ఏపీపై ప్రభావం అంతగా ఉండకపోవచ్చని వెల్లడించింది. ఈ నెల19 నుంచి బంగాళాఖాతంలో వాతావరణ మార్పులు ఉంటాయని తెలిపింది. మొ దట ఉపరితల ఆవర్తనం ఏర్పడి, ఆ తర్వాత అల్పపీడనంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని వివరించింది.దీంతో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాం తాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకా శం ఉన్నదని పేర్కొన్నది. ముఖ్యంగా 25 నుంచి 28 వరకు తెలంగాణలో వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. మరోవైపు చలి తీవ్రత తగ్గడంతో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, దాదాపు అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయని వెల్లడించింది. నెలా ఖరుకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరే అవకాశాలుంటాయని పేర్కొన్నది.

# రైతులకు ద్రోహమే...

(మొదటి పేజీ తరువాయి)

దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్‌లతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటీ..? కాలక్రమేణా పప్పుధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటీ? జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుందా? ఒకసారి ద్వారాలు తెరిచిన తర్వాత వీటిలో మరిన్ని పంటలను చేర్చకుండా ఎలా ఆపగలం? వీటికి ఏమైనా రక్షణ చర్యలు ఉన్నాయా? లేదా ఇలాగే ప్రతి ఒప్పందంలో మరిన్ని పంటలను ఈ జాబితాలో చేరుస్తారా?" అని రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. భారత వ్యవసాయ రంగంపై మరో దేశం పట్టును సాధించేందుకు అనుమతి ఇస్తున్నామా? అని ఈ సందర్భంగా అనుమానం వ్యక్తం చేశారు.

# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు.

# ఒక మున్సిపాల్టీ గెలిస్తే దాన్ని లాక్కుంటారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. అలాంటి వెగటు రాజకీయాలు చేసే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందనీ, ఆ బాటలో వెళితే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆమె హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287 జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జీవో 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంత్ సేవాలాల్ జీవితాన్ని పాఠ్యాంశంగా దేశ వ్యాప్తంగా పుస్తకాల్లో పెట్టాలనీ, గోర్ భోళి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ లో చేర్చాలని ఆమె కోరారు.గ్రామ పంచాయితీలుగా మారిన తండాల్లో సరైన వసతుల కల్పనకు రూ.25 లక్షలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీలో బంజారాలకు 5 సీట్లు అనడంలో హేతుబద్ధత లేదని ఆమె కొట్టిపారేశారు. బంజారాలకు, ఆదివాసీలకు మధ్య ఘర్షణ పెట్టేలా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ఆ రెండు వర్గాల హక్కుల కోసం తాము పోరాడుతున్నామని ఆమె తెలిపారు. రెండేండ్లలో జరిగిన అడ్మిషన్లు, ప్రమోషన్లు, ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కవిత కోరారు. సేవాలాల్ ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదనీ, ఇహలోకం ఎలా జీవించాలో బోధించారని ఆమె గుర్తుచేశారు. సేవాలాల్ పేరుతో, ఆదివాసీల పేరుతో, ఎరుకల తెగ పేరుతో ఏర్పాటు చేస్తామన్న మూడు కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వేడుకల్లో బంజారా ఆధ్యాత్మిక గురువులు పలువురు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల కోసం పోరాటం: కేటీఆర్

**తొలి అక్షరం/హైదరాబాద్, ఫిబ్రవరి 15:**సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణిలో జరుగుతున్న దోపిడీని అడ్డుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా కొత్తగూడెంలో బీఆర్ఎస్ తన మద్దతు సీపీఐకి ప్రకటించిందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి దోపిడీలో భాగస్వాములై సంస్థను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సీపీఐ కాంగ్రెస్ ఇప్పటికే అలయన్స్ లో ఉన్నాయనీ, కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు. ఏఐటీయూసీ ఈ పొత్తును ఎందుకు అంగీకరించిందో తెలియదన్నారు. దాని వెనుక ఏ ఒత్తిళ్లు పని చేశాయో తాను చెప్పలేనని వ్యాఖ్యానించారు.అయితే ఎవరు కలిసి వచ్చినా, కలిసి రాకపోయినా సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో ఎట్లా పోరాడామో భవిష్యత్తులో కూడా అలాగే పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అహింసా సిద్ధాంతమే దిక్సూచి







- గోరు సిక్వాడి వచ్చిరి దళ్ రాష్ట్ర ప్రముఖ్ కేపీ నాయక్
- చంద్రు తండాలో మిన్నంటిన 'సేవాలాల్' జయంతి వేడుకలు
- బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్
- ఘనంగా బైక్ ర్యాలీ.. భక్తిశ్రద్ధలతో పూజలు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి15:** బంజారా సమాజ ఆధ్యాత్మిక మార్గదర్శి, సామాజిక సంస్కర్త సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఆదివారం వర్ధన్నపేట మండలంలోని చంద్రు తండా గ్రామంలో అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ భూక్య నీలా రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, గిరిజనులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే తండాలో పండుగ వాతావరణం నెలకొంది. సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జై సేవాలాల్ నినాదాలతో హోరెత్తించారు.అనంతరం గ్రామపంచాయతీ ప్రాంగణంలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా భోగ్ బండార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన గోరు సిక్వాడి వచ్చిరి దళ్ రాష్ట్ర ప్రముఖ్ కేపీ నాయక్ మాట్లాడుతూ..... బంజారాల జీవితాల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్. ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని ఏకం చేసి, అహింసా సిద్ధాంతం ద్వారా ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన గొప్ప ఆధ్యాత్మిక గురువు ఆయన అని అన్నారు. **సామాజిక సంస్కరణ:** సమాజంలోని అజ్ఞానం, మూఢనమ్మకాలను తొలగించి సమానత్వం కోసం సేవాలాల్ కృషి చేశారు. **మానవత్వమే ఆరాధన:** సేవ చేయడం ద్వారానే జీవితం సార్థకమవుతుందని, మానవ సేవయే మాధవ సేవ అని చాటిచెప్పారు. **యువతకు స్ఫూర్తి:** నేటి తరం యువత సేవాలాల్ బోధనలను ఆచరిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఈ వేడుకల్లో సర్పంచ్ భూక్యా నీలా – రవినాయక్, ఉపసర్పంచ్ భూక్యా బుజ్జి – భద్రునాయక్తో పాటు వార్డు సభ్యులు దేశ్య, వెంకన్న, వెంకటేష్, రాజు, నెహ్రూ, స్వామి, రాజేందర్ రాథోడ్ పాల్గొన్నారు. అలాగే తండా నాయకులు రామచంద్రు, వెంకన్న, శ్రీరాములు, రవి, రాజు,బోజ్యా,గోర్సేన నాయకులు చిట్టిబాబు, కృష్ణ, మధు, శ్రీనివాస్‌లు పాల్గొని సంత్ సేవాలాల్‌కు నివాళులర్పించారు.

# వార్డుల అభివృద్ధికి కౌన్సిలర్లు వారధులుగా నిలవాలి





- బేడ(బుడగ) జంగాల సంక్షేమానికి అండగా ఉండాలి
- తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు చిత్తారి అనంతయ్య
- సంగారెడ్డిలో నలుగురు కౌన్సిలర్లకు ఘన సన్మానం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి15:** ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించిన మున్సిపల్ కౌన్సిలర్లు వార్డుల అభివృద్ధికి వారధులుగా నిలవాలని, ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన బేడ(బుడగ) జంగాల సంక్షేమానికి ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు చిత్తారి అనంతయ్య ఆకాంక్షించారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలో బేడ(బుడగ)జంగాల సంఘం,బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల గౌరవార్థం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. **పూలమాలలతో ఘన స్వాగతం:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన 11వ వార్డు కౌన్సిలర్ దశరథ్ రెడ్డి,12వ వార్డు కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి,36వ వార్డు కౌన్సిలర్ మనీలా మల్లేశం, 37వ వార్డు కౌన్సిలర్ జలంధర్ రావులను చిత్తారి అనంతయ్య ఇతర నాయకులతో కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. **వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి: అనంతయ్య** అనంతయ్య మాట్లాడుతూ..వార్డు ప్రజల సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.బేడ(బుడగ) జంగాల సామాజిక అభివృద్ధికి,వారి సంక్షేమ పథకాల అమలులో కౌన్సిలర్లు అండగా ఉండాలి కోరారు. వార్డుల్లో మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా పనిచేయాలి అని ఆయన పిలుపు నిచ్చారు.కౌన్సిలర్ల విజయానికి కృషి చేసిన కార్యకర్తలను,సంఘం సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సదుల మల్లేశం,అల్లం చంద్రయ్య,కడమంచి దుర్గయ్య(బీఆర్ఎస్ సీనియర్ నాయకులు),తూర్పాటి పెంటయ్య,సదుల బాబు,అనరాశి శ్రీనివాస్,చిత్తారి దత్తాత్రి,శ్రీనివాస్,సిద్ది రాములు అల్లం,టేకు చంద్రయ్య,శ్రీశైలం టేకు, మిరియాల కృష్ణ,షావుకారి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## 53% సీట్లలో బీసీలు గెలుపొందడం బీసీ చైతన్యానికి నాంది

- బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు వ్యాఖ్య




**తొలి అక్షరం/మిర్యాలగూడ/ ఫిబ్రవరి15:** ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 53శాతం సీట్లలో బీసీలు గెలవడం వారి చైతన్యానికి నాంది అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు. ఆదివారం నాడు ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీసీ భవన్ లో బీసీ హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ..... బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపితే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకున్నదని, బిజెపి పార్టీ పచ్చి బీసీ వ్యతిరేక పార్టీగా ముద్రవేసుకున్నదని తెలంగాణ రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉంటే కనీస ఒక మున్సిపాలిటీ కూడా గెలుచుకోలేకపోయిందని అందుకు కారణం బిజెపి అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలే కారణమని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని బీసీ వ్యతిరేకతను విడనాడి బీసీల ఉన్నతికి ఆ పార్టీ తోడ్పడితే తెలంగాణలో నిలబడుతుందని లేదా తెలంగాణకు– బిజెపికి రుణం తీరిపోతుందని ఆయన అన్నారు. 53% స్థానాల్లో బీసీలు గెలుపొందిన వైనాన్ని ఆయా పార్టీలు గుర్తించి మేయర్ డిప్యూటీ మేయర్ పదవుల లో 53% బీసీలకు కేటాయించాలని, ఇటీవల కాలంలో బిఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని నిజంగా వారికి బీసీల పట్ల నిజమైన అభిమానం ఉంటే వారు గెలిచిన 17 మున్సిపాలిటీల్లో 10% మున్సిపాలిటీలు బీసీలకు కేటాయించాలని అలాగే రేవంత్ రెడ్డి కూడా బీసీల అభ్యున్నతి కట్టుబడి ఉన్నామని తరచూ ప్రకటిస్తశీస్తుంటారని ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నశీ ప్రభాకర్ స్పందించి బీసీలకు మెరుగైన మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ మేయర్ డిప్యూటీ మేయర్ పదవులు కేటాయించాలని ఆయన కోరారు ఆయన బిడ్డ బీసీ హక్కుల సాధన సమితి నాయకులు చిలకల రాజు శ్రీను సత్య ప్రకాష్ నాయుడు కొమర్రాజు వెంకట్ ఉన్నారు

## ఇనుగుర్తిలో లోక కల్యాణం: కమనీయం.. బ్రహ్మంగారి పెళ్లి వేడుక!

**భక్తుల జయజయధ్వానాల మధ్య శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం**

**ఆధ్యాత్మికతకు నిలయంగా ఇనుగుర్తి మండల కేంద్రం.. భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం**





**తొలి అక్షరం/ఇనుగుర్తి ఫిబ్రవరి 15:** ఇనుగుర్తి మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం భక్తి భావంతో పులకించిపోయింది. ఆదివారం నాడు ఆలయ పూజారి తుమ్మనపల్లి చుక్కయ్య పర్యవేక్షణలో శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల కళ్యాణం నేత్రపర్వంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. **భక్తి త్యాగాలకు ప్రతీక:** ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లోజు ప్రభాకర్ చారి మాట్లాడుతూ, బ్రహ్మంగారి జీవితం మరియు వారి బోధనలు సమాజానికి మార్గదర్శకమని కొనియాడారు. ఈ కళ్యాణ వేడుక భక్తులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడమే కాకుండా, ధర్మ మార్గంలో నడిచేలా ప్రేరేపిస్తుందని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. **తరలివచ్చిన ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, దీకొండ వెంకన్న, గంజి రాజేందర్ రెడ్డి, బొబ్బిలి మహేందర్ రెడ్డి, తుమ్మనపల్లి పూర్ణాచారి వంటి ప్రముఖులతో పాటు అక్కెర హరీష్, కాయితోజు ఉమేష్, శ్రీనివాస చారి, జనగం రాజు, నరేష్, సొల్లేటి సదయ్య, గుగ్గిళ్ళ సురేష్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, రామగిరి నవీన్, నరసింహ చారి, మోహన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ





**తొలి అక్షరం/మేడిపల్లి/ ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడిపల్లి శివాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన సంఘం ప్రతినిధులు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ పలు రకాల పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు సముద్రాల వెంకటేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రాంబాబు గుప్తా, కోశాధికారి బజ్జూరి శేఖర్ గుప్తా కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

## యూరియా డీలర్లు తప్పకుండా నిబంధనలు పాటించాలి

- ఏజాజ్ అలీఖాన్ వ్యవసాయ అధికారి రామన్నపేట




**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 15:**రామన్నపేట మండల వ్యాప్తంగా డీలర్లు ఎవరైతే యూరియా స్టాక్ రిసీవ్ చేసుకున్నారో వారు సోమవారం ఉదయం 10 గంటలకు మాత్రమే రైతులకు బుకింగ్కి అవకాశం ఇవ్వాలి. ఉదయం 10 గంటల లోపు బుకింగ్ కి అవకాశం ఇవ్వొద్దు. ఈ విషయాన్ని అందరూ ఫర్టిలైజర్ డీలర్లు చూసే తప్పకుండా అనుసరించాలి. ఇప్పటినుండి ప్రతి ఒక్క డీలర్ పై విధంగా ఆదివారం స్టాక్ రిసీవ్ చేసుకున్నట్లయితే సోమవారం ఉదయం 10 గంటలకు లేదా 10 గంటల తర్వాత స్టాక్ రిసీవ్ చేసుకున్నట్లయితే మధ్యాహ్నం 3 గంటలకు మాత్రమే రైతులకు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకొని ఫాలో కావాలని పత్రికా ప్రకటనలో తెలిపినారు

## బ్రహ్మోత్సవాలకు ఉచిత ఆటో ప్రయాణ సదుపాయం

- గర్దాసు విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం





**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 15:**ఇంద్రపాల పార్వతి శంకర స్వామి ఎల్లమ్మ జమదగ్ని మునిరాజులు కళ్యాణమహోత్సవానికి వెళ్లే భక్తులకు వడ్లకొండలక్ష్మి మల్లేశం సహకారం తో ఏర్పాటు చేసిన ఉచిత ఆటో ప్రయాణ సౌకర్యాని ప్రారంభించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ,ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, సింగణబోయిన జంగయ్య, సింగణబోయిన గణేష్,రాస వెంకటేష్, రవ్వ నర్సింహా,గర్ధాస్ కరుణాకర్, నక్క వెంకటేష్, గండు మల్లేష్, గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ మహేష్, చింటు, కొమ్మగోని సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో అందే మోహన్‌కు చైర్మన్ అవకాశం ఇవ్వాలి

## ప్రజల మధ్యనుండి వచ్చిన నాయకుడికి చైర్మన్ బాధ్యతలు అప్పగించాలి

## టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ విజ్ఞప్తి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** అందే మోహన్ కు షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి అవకాశం కల్పిస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని సింగపాగ జంగయ్య మాదిగ పేర్కొన్నారు. ఈ మేరకు స్తానిక ఎమ్మెల్యే శంకర్ కు ,రాష్ట్ర పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ప్రతి నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తూ, అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేసిన యువ నాయకుడు అందే మోహన్ అని తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు తీసుకెళ్లే నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ప్రజలతో మమేకం అయ్యే స్వభావం ఆయన ప్రత్యేకతలని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే ఎస్సీ సమాజంలోని అన్ని ఉపవర్గాలకు రాజకీయంగా సముచిత అవకాశాలు దక్కుతాయని, ఈ అంశంపై ఎప్పటి నుంచో మద్దతు తెలుపుతూ సహకారం అందించిన నాయకుడు మోహన్ అని జంగయ్య మాదిగ గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా ప్రజలకు న్యాయం చేసినట్లవుతుందని అన్నారు. కాబట్టి షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించి, అందే మోహన్‌కు మున్సిపాలిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గొప్ప మనసు చాటుకున్న సమీర్ పటేల్


## - కులమాతలకు అతీతంగా శివాలయానికి సీసీ కెమెరా ఏర్పాటు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** కులమాతలకు అతీతంగా గొప్ప మనసు తో గ్రామ శివాలయం లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గులాం సమీర్ పటేల్. అల్వాల గ్రామపంచాయతీలో శివాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా కుల మతాలకు అతీతంగా శివాలయం గుడి దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివాలయానికి సీసీ కెమెరా ఏర్పాటు చేసినందుకు అల్వాల గ్రామ ప్రజలు గులాం సమీర్ పటేల్ ను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆల్వాల్ గ్రామ డిప్యూటీ సర్పంచ్ తిరుమల రెడ్డి, మల్లేష్, మద్దూరి కృష్ణ, చాకలి శ్రీశైలం, మంగలి శివ, సూరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన దైద రవీందర్





**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి సందర్భంగా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో కృష్ణా నదిలో పుణ్య స్నానం ఆచరించి వాడపల్లి శివాలయంలో హర హర మహాదేవుడిని దర్శించుకొని స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

# నిజాంపేట్ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శివనామస్మరణ.. పోటెత్తిన భక్తజనం!

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం భక్తుల జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ఆలయ ఆవరణలో కొలువై ఉన్న పరమశివునికి తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. “ఓం నమః శివాయ“ అనే పంచాక్షరీ మంత్రంతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. **అర్చకుల సందేశం:** శివరాత్రి తెచ్చే మార్పు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామస్వామి, పవన్ స్వామి మరియు అనిల్ స్వామి మాట్లాడుతూ శివరాత్రి విశిష్టతను భక్తులకు వివరించారు. **జ్ఞానోదయం:** “శివరాత్రి అంటే కేవలం ఉపవాసం, జాగరణ మాత్రమే కాదు.. అది మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించుకునే పవిత్ర సమయం“ అని రామస్వామి పేర్కొన్నారు. **సంకల్ప బలం:** పవన్ స్వామి మాట్లాడుతూ, “శివరాత్రి రోజున భక్తితో చేసే ప్రార్థన వల్ల మనసు నిర్మలమవుతుంది. ఏ పనైనా దృఢ సంకల్పంతో చేసే శక్తిని ఆ పరమశివుడు ప్రసాదిస్తాడు. ఈ రోజున చేసే ధ్యానం వల్ల సమాజానికి, వ్యక్తిగత జీవితానికి ఎంతో మేలు జరుగుతుంది“ అని





వివరించారు. **లోక కళ్యాణం:** “ప్రతి భక్తుడు లోక కళ్యాణం కోసం ప్రార్థించాలి. శివుడు లయకారుడు మాత్రమే కాదు, శుభప్రదాత కూడా. ఈ పర్వదినం అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుంది“ అని అనిల్ స్వామి ఆకాంక్షించారు. **వైభవంగా విశేష పూజలు** శివరాత్రి



సందర్భంగా ఆలయంలో మహా న్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన మరియు రాత్రంతా నాలుగు యామాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. హనుమంతుడి సన్నిధిలో శివుడికి జరిగిన ఈ వేడుకలు నిజాంపేట్ ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి.

# ధర్మ బిక్షం సేవలు మరువలేనివి

**గీత పని వారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ ఎంపీ , బొమ్మగాని ధర్మబిక్షం కాంస్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి...**

**సూర్యాపేట జిల్లాకు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం పేరు ఖరారు చేయాలి..**

**గీత పని వారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ,సిపిఐ పార్టీ మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం 104వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి...**

**గీతా పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్...**



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 15:** రామన్న పేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద గీత పని వారల సంఘం ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ మాజీ ఎంపీ గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ,స్వాతంత్ర పోరాట యోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, బొమ్మగాని ధర్మబిక్షం 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా వారి ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించి గీత పని వారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ మాట్లాడుతూ, గీత పని వారల కోసం, వారి హక్కుల కోసం తన జీవిత కాలాన్ని త్యాగం చేసి వారి హక్కులపై పోరాడి ఎన్నో చిరస్మరణీయ విజయాలను సాధించిన బొమ్మ గాని ధర్మబిక్షం కాంస్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ,అదేవిధంగా వారి జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చి నేటి తరం యువతకు తెలియజేయాలని ,సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..... ఈ జయంతి వేడుకలలో పాల్గొన్నవారు గీత పనివారల సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, బాలగోని మల్లయ్య, గంగాపురం యాదయ్య, బాలగోని నరసింహ, కూనూరు కృష్ణ, వీరమల్ల ముత్తయ్య, బత్తుల సత్తయ్య, గుండు లింగయ్య, గోపగోని మల్లయ్య, భూపతి నరసింహ, వీరమల్ల వెంకటయ్య, పల్లె మల్లేష్, ఆకిటి స్వామి, వీరమల్ల నరసింహ, వీరమల్ల శేఖర్, గోపగోని గోపాల్, గిరకల శంకరయ్య , లింగస్వామి శంకరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు..

# మహాశివరాత్రి పర్వదినాన ఉమామహేశ్వరుని కళ్యాణానికి 'సరస్వతి జ్యువెలరీ'పుస్తమట్టెలు

- శివపార్వతుల కళ్యాణ ఏర్పాట్లు
- స్వామివారికి పుస్తె మెట్టలు
- సమర్పించి మొక్కులు తీర్చుకున్న తాడూరి రమేష్-సరస్వతి దంపతులు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ, ఫిబ్రవరి 15:** లోక కళ్యాణం కోసం వెలసిన ఆది దంపతులు ఉమామహేశ్వరుల కళ్యాణ మహోత్సవానికి మరిపెడ బంగ్లా మండల కేంద్రం సిద్ధమైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తాళ్లవుకల క్షేత్రంలో వేంచేసి ఉన్న శివపార్వతుల కళ్యాణ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర కార్యంలో భాగంగా స్థానిక సరస్వతి జ్యువెలరీ అధినేత తాడూరి రమేష్ - సరస్వతి దంపతులు తమ భక్తిని చాటుకున్నారు. స్వామివారి కళ్యాణ మహోత్సవం కోసం అత్యంత ప్రీతిపాత్రమైన బంగారు పుస్తెలు మరియు వెండి మెట్టలను ఈ దంపతులు ఆలయ కమిటీకి అందజేశారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే రమేష్ గారు, ఈసారి సాక్షాత్తు ఆ జగన్మాత పార్వతీదేవికి మంగళసూత్రాలను సమర్పించడం తమ పూర్వజన్మ సుకృతమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. “లోక రక్షకుడైన పరమశివుని సేవలో భాగస్వామ్యం కావడం మా అదృష్టం. ఆ ఉమామహేశ్వరుల ఆశీస్సులు మండల ప్రజలందరిపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాము“ అని తెలిపారు. భక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేష్ దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. దాతల ఉదారతను ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు అవమానం



**తొలి అక్షరం/ఏన్కూర్ ఫిబ్రవరి 15:** ఏన్కూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఖమ్మం జిల్లా ఎస్టీ సెల్ యూనియన్ సభ్యులు, ఏన్కూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు భుక్యా వినోద్ కుమార్ రాథోడ్ మాట్లాడుతూ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారా ప్రజలకు తీవ్ర అవమానం జరుగుతుందని, బంజారా ప్రజలు అంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత చిన్న చూపా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాల ఆరాధ్య దైవం అయిన శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ని గత ప్రభుత్వం వైభవంగా నిర్వహించేదని, ప్రతి జిల్లా కేంద్రంలో, ప్రతి మండల కేంద్రాలలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గతంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండు సంవత్సరాలు దాటిన కూడా ఒక్కసారి కూడా సేవాలాల్ జయంతి వేడుకలు ఎక్కడ నిర్వహించలేదని, బంజారా ప్రజలు అంటే ఇంత చిన్న చూపా ఈ ప్రభుత్వానికి అని ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భుక్యా వినోద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వానికి బంజారాలు అంటే చిన్న చూపే అని, ప్రభుత్వంలో ఒక్క మంత్రిత్వ శాఖ కూడా గిరిజన ఎమ్మెల్యే కు ఇవ్వలేదని అన్నారు. గిరిజన ఎమ్మెల్యే లు అంటే కూడా ఈ ప్రభుత్వానికి లోకువేనని అన్నారు. బంజారా ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలపై ఉన్న నిర్లక్ష్య వైఖరి మార్చుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు.

# కేశంపేట్ మండలంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సేవలాల్ జయంతి వేడుకలు

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి**

**కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జర్పుల రాజు నాయక్, సబావట్ రుప్ల నాయక్**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** కేశంపేట్ మండలంలో బారీగా రాలి బొగ్ బండారో పార్టీలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు జరుపుల రాజు నాయక్. నాయక్ కమిటీ అధ్యక్షులు, సభావట్ రూప్లా నాయక్ ఆధ్వర్యంలో కేశంపేట మండలంలో జరిగిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి, కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీనవీన్ రెడ్డి మాట్లాడుతూ సేవలాల్ 287జయంతి సదర్భంగా కమిటీ నాయకులకు సర్పంచులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి తండా లో గుడి నిర్మిస్తే నావంతు సహాయం, సహకారలు ఉంటాయని మరియు పార్టీ లకు అతీతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి తండా నుంచి వచ్చిన సర్పంచ్ లకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన నాయకులు వీరేందర్ నాయక్, దేవుజ నాయక్, శంకర్ నాయక్, మరియు సర్పంచులుఆర్. భాస్కర్ నాయక్, తరియా నాయక్, భాస్కర్ నాయక్, రవి నాయక్, డిప్యూటీ సర్పంచ్ లు రాజు నాయక్, రవి నాయక్. దేవ్ సింగ్ నాయక్, రామచందర్ నాయక్, జగన్ నాయక్, శ్రీనివాస్ నాయక్, ఎం.శంకర్ నాయక్, లక్య నాయక్, దాసు నాయక్, బాలు నాయక్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల అభ్యున్నతికి సేవాలాల్ బోధనలు ఆదర్శం

**నీతి, న్యాయం, అహింసతో సమాజ నిర్మాణం సాధ్యం అని చాటి చెప్పిన మహనీయుడు**

**సంత్ సేవలాల్ ఆశయాలే నేటి సమాజానికి దిక్సూచి**

**సంత్ సేవలల్ మహారాజ్ గుడి నిర్మాణానికి సహకారం అందిస్తా**

**దేవాలయాలు, విద్యాలయాలతోనే అభ్యున్నతి సాధ్యం...**

**బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శీను వెల్లడి**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** మానవ రూపంలో అవతరించిన దైవస్వరూపుడే సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ అని, ఆయన చూపిన సేవా మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షులు కేశమోని శ్రీనివాస్ (సదర్ శ్రీను) పేర్కొన్నారు.ఆదివారం నందిగామ మండలం బండకుంట తాండా, పెద్దగుట్ట తండాల్లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.....సేవలాల్ మహారాజు బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదు,సమాజ చైతన్యానికి ప్రతీక. నీతి, న్యాయం, సత్యం, అహింస, సమానత్వం వంటి గొప్ప విలువలను ప్రజల్లో నాటుతూ జీవితాంతం సేవామార్గంలో నడిచిన మహనీయుడు. మూఢనమ్మకాలను తొలగించి, విద్య , శ్రమ, స్వాభిమానమే అభివృద్ధికి మార్గమని బోధించిన గొప్ప సంస్కర్త. ఈ పర్వదినం బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటిచెప్పే పవిత్ర సందర్భంగా నిలుస్తుంది.సేవలాల్ మహారాజు సత్యం మార్గంలో నడవాలిని,సమాజ సేవ చేయాలని,చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,ఐక్యతతో ముందుకు ముందుకు సాగాలని ఆనాటి రోజుల్లోనే చాటి చెప్పారని గుర్తు చేశారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. నేటితరం యువత విద్యతో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా కొండ కోనల్లో, చెట్టు చేమల్లో భూమిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనుల జీవన పరిస్థితుల్లో పెద్ద మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతి మనిషికి భయం, భక్తి, నీతి అవసరమని, గిరిజన సమాజ అభివృద్ధికి రాజకీయ చైతన్యం అత్యంత ముఖ్యమని అన్నారు.విద్యే భవిష్యత్తుకు వెలుగుదీపమని, తమ పిల్లలను చదివించి ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని సూచించారు.చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా పెంపొందించుకోవాలని, తాను సమాజ సేవకుడిగా దేవాలయాలు, పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని హామీ ఇచ్చారు.బండకుంట తండాలో తాగునీటి సమస్యను గుర్తించి రెండు బోర్లు వేయించినా నీరు రాకపోవడంతో మరోసారి బోరు వేయించగా నీరు రావడం సంతోషాన్ని అందించిందన్నారు. త్వరలోనే మోటార్ అమర్చి గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.అదే విధంగా సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం రూ. 1,11,111 విరాళంగా అందజేస్తానని ప్రకటించారు.మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ... ప్రజలు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కే శ్రీను నాయక్, గోపాల్ నాయక్, పీరియా నాయక్, పీ ఠాకూర్, కె రవి, కె లింగం, కె నరేష్, కే శ్రీను, కే జంపు, అశ్లీ, లక్ష్మి తదితర గిరిజన నాయకులు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.సేవ, సమానత్వం, సమాజ చైతన్యమే సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గమని, ఆ మార్గంలో నడిచినప్పుడే గిరిజన సమాజానికి నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# భక్తి సాగరంలో కాట్రపల్లి.. కాకతీయ శివాలయంలో శివయ్యకు మహాలింగాభిషేకం!


**ముక్కంటి సేవలో తరించిన గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్**

**గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కన్నుల పండుగగా మహాశివరాత్రి వేడుకలు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఫిబ్రవరి 15:** కేసముద్రం (కాట్రపల్లి):హరహర మహాదేవ.. శంభో శంకర.. అనే నినాదాలతో కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామ వీధులు మార్మోగాయి. మహాశివరాత్రి పుణ్యకాలం సందర్భంగా స్థానిక చారిత్రక కాకతీయుల శివాలయం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేక ప్రియుడైన పరమేశ్వరుడికి జలాభిషేకాలు, అర్చనలు చేశారు.**నిష్ఠగా జరిగిన ఆధ్యాత్మిక క్రతువు:** వేద పండితులు వరంగంటి వెంకటాచార్యుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఏటా ఆ త్రినేత్రుడి సేవలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని సమ్మయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ వేడుకను విజయవంతం చేసిన గ్రామ పెద్దలకు, యువతకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ మహాశివరాత్రి శుభాకాంక్షలు అందజేశారు.**భారీగా తరలివచ్చిన నేతలు - కార్యకర్తలు:** ఈ భక్తి కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులందరూ ఐక్యమత్యంతో పాల్గొన్నారు. ముఖ్యంగా:**గ్రామ సర్పంచ్:** ఎదరబోయిన సూరయ్య **ఉప సర్పంచ్:** చాగంటి యాదగిరి **ముఖ్య నేతలు:** రావుల విజయపాల్ రెడ్డి, సామల నర్సయ్య, చాగంటి రాము, మోడెం రాజు**యువత ఉత్సాహం:** కొండపల్లి రాకేష్ రెడ్డి, పలుస రాకేష్ గౌడ్, శీలం మహేష్, చీకటి ప్రశాంత్, ఎదురబోయిన సునీల్, గుడ్ల శ్రీనివాస్, బూర రాజకుమార్, మొలకల విశాల్, యశ్వంత్, సంధ్య, సందేపాక వెంకన్న, బొంత వెంకన్న తదితరులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని శివరాత్రి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.శివనామ స్మరణతో కాట్రపల్లి గ్రామం ఆధ్యాత్మిక కాంతులతో వెలిగిపోయింది. చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలు అందరిలో భక్తి భావాన్ని నింపాయి.

# శ్రీ జలేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** శ్రీ జలేశ్వరాలయంలో మాహాశివరాత్రి రోజున ఉదయము ఆరు గంటలకు గణపతి పూజ తో ప్రారంభమై,శివునికి అభిషేక కార్యక్రమాలు సాయంత్రం 6 గంటల వరకు జరిపారు.వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ,తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో రావ 6.00 గం॥ నుండి 8.00 గం॥ల వరకు శివ కళ్యాణ మహోత్సవం జరిగింది తిరిగి ఎనిమిది గంటల నుండి ఉవ 5గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు అభిషేకాలు వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జలేశ్వర ఆలయ సన్నిధిలో స్వామివారి కృపకు పాత్రులైనారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మట్ట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...2014 సంవత్సరంలో భీష్మ ఏకాదశి పర్వదినాన తవ్వకాలు జరుపుతుండగా కాకతీయుల కాలం నాటి శివలింగం బయటపడిందని,అప్పటి నుంచి జలేశ్వర స్వామి ఆలయంగా నామకరణం చేసి ప్రతి యేడు ఉత్సవాలను జరిపిస్తున్నామన్నారు.మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అట్టహాసంగా జరిగే స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారని,శ్రీమహాగణపతి, సుబ్రమణ్యస్వామి,నంది విగ్రహం,ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠ జరిగిందని తెలిపారు.దాతల సహకారంతో జలేశ్వరాలయాన్ని పూర్వవైభవాన్ని చాటేలా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అన్నిరకాలుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని చెప్పారు. ఆలయ కమిటీలో 10మంది కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి పనులకు గాను సమావేశాలు ఏర్పాటు చేసుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను భక్తులు,ప్రజాప్రతినిధుల నిర్ణయం మేరకు కమిటీ ఆమోద పరిచి దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడంతోపాటు జలేశ్వర స్వామి ఆశీస్సులను పొంది,భక్తులు క్రమశిక్షణ కలిగి ఉండటంతోపాటు ఆలయ కమిటీ సభ్యులకు సహకరించి స్వామి వారి కృపకు పాత్రులైనారని మట్ట శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# సొంత గూటికి చేరుకున్న 59వ డివిజన్ కార్పొరేటర్ మాజీద్ హుస్సేన్

- కండువా కప్పి ఎంఐఎంలోకి ఆహ్వానించిన అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ



**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి15:** ఏఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సమక్షంలో కరీంనగర్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ నేతృత్వంలో 59 వ డివిజన్ కార్పొరేటర్ మజీద్ హుస్సేన్ 200 మంది అనుచరులతో కలిసి ఆదివారం హైదరాబాద్ దారుస్సలామ్ లో ఎంఐఎం లో చేరారు. ఈ సందర్భంగా మాజీద్ హుస్సేన్ కు ఆకుపచ్చ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ. ఎంఐఎం పార్టీలో గెలుపొందిన మొహసిన్ మొహియుద్దీన్, ఆతిఫ్ ఆతిన, నసీం సుల్తానా ఇబ్రహీంలను పూలమాలలు శాలువాలతో ఆత్మీయంగా బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సన్మానించారు. గతంలో ఎంఐఎం పార్టీలో కొనసాగిన మాజీ హుస్సేన్ కు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో ఎంఐఎం రెబెల్ అభ్యర్థిగా 59వ డివిజన్ ముకరంపురాలో పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీలో కలిసి తమ పార్టీలలో చేరాలని ఆహ్వానించినప్పటికీ మాజీ దృశ్యం దాన్ని సున్నితంగా తిరస్కరించి డివిజన్ పెద్దలతో చర్చించి రాబోయే తన రాజకీయ భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా తాను అభిమానంతో బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీపై, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లపై నమ్మకంతో ఏఐఎంఐఎం పార్టీలో చేరుతున్నారని ప్రకటించారు. డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శ్రమించాలని డివిజన్ ప్రజలు ఏదైతే నమ్మకంతో గెలిపించారో వారి నమ్మకాన్ని, వమ్ము చేయకుండా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగకుండా కృషి చేయాలని డివిజన్ అభివృద్ధికై అహర్నిశలు పాటుపడాలని అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ తనతో చెప్పారని పేర్కొన్నారు. జావిద్, బాబ్బాయి, ఎక్బాల్, జహూర్, ఫైసల్, హమీద్, తయ్యబ్, ఇంతియాజ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి రఫీ తదితరులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర ఆలయంలో శివనామస్మరణ



**తొలి అక్షరం/దంతాలపల్లి ఫిబ్రవరి 15:**
దంతాలపల్లిలోని శ్రీ భవాని సామెత రామలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి పర్వదినం వేల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది ఆదివారం తెల్లవారుజాము నుంచే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు శివశర్మ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

# షాద్‌నగర్ 25వ వార్డులో బీజేపీ విభేదాలు బహిర్గతం


**- టికెట్ కేటాయింపుపై జంబుల నరసింహులు మద్దతుదారుల ఆగ్రహం**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 25వ వార్డులో చోటుచేసుకున్న పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. గత 15 ఏళ్లుగా భారతీయ జనతా పార్టీకు సేవలందిస్తున్న జంబుల నరసింహులకు ఈసారి టికెట్ దక్కకపోవడంపై ఆయన మద్దతుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి గణనీయమైన ఓట్ల శాతం సాధించిన నరసింహులు, అప్పటినుంచి ప్రజల్లోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని వారు పేర్కొన్నారు.అయితే ఈ ఎన్నికల్లో స్థానిక నాయకత్వాన్ని పక్కనబెట్టి ఫరూక్‌నగర్‌కు చెందిన రుషికేష్‌కు టికెట్ కేటాయించడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. పార్టీ టికెట్ వస్తుందనే నమ్మకంతో నామినేషన్ దాఖలు చేసిన నరసింహులు, టికెట్ లభించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయనపై దుష్ప్రచారం జరిగిందని,ఉద్దేశపూర్వకంగా ఓట్లు దూరం చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.ఇక అధికారిక బీజేపీ అభ్యర్థి కూడా గెలవకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసిందని అంటున్నారు. స్థానికంగా సేవ చేసిన నాయకుడిని పక్కనపెట్టడం వల్లే పార్టీ నష్టపోయిందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.ఈ పరిణామాలపై పార్టీ ఉన్నత నాయకత్వం స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జంబుల నరసింహులు మద్దతుదారులు కోరుతున్నారు.

# మనలో భక్తి, శక్తి, శాంతిని నింపేది పవిత్ర మహా శివరాత్రి

- కేశంపేట మండలం మాజీ జెడ్పీటీసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మనందరి జీవితంలో శివుడి ఆశీస్సులు ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరుతూ కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దంపతులు శివాలయంలో పూజలు నిర్వహించారు.మహా శివరాత్రి పర్వదిన శుభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ పరమేశ్వరుని దివ్య ఆశీస్సులు, కరుణాకటాక్షాలు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. భక్తి, నిష్ఠ, ధర్మపాలనతో జీవిస్తూ సమాజంలో సౌభ్రాతృత్వం, శాంతి, సౌఖ్యాలు విరాజిల్లాలని ఆకాంక్షించారు. మహాదేవుని ఆశీస్సులతో మనమందరం అభివృద్ధి పథంలో మరింత పురోగమించాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో కళకళలాడాలని ఆకాంక్షించారు.

## ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

**- ప్రత్యేకంగా ఆకట్టుకున్న బంజారాల నృత్యాలు**



**తొలి అక్షరం/అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 15 :** అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలో బంజారాల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుంగనూరు మండలం సుగాలిమిట్ట గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బంజారాలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుగాలిమిట్ట గ్రామం నుంచి పుంగనూరు పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వరకు బాణాసంచాల కాలుస్తూ, బళ్లారి డ్రమ్స్, డిజె సౌండ్స్, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో బంజారాలు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు

**షాద్ నగర్ సిఐ విజయ కుమార్**

**భక్తులందరూ శాంతియుతంగా స్వామివారిని దర్శించుకోవాలి**

**మహాశివరాత్రి పర్వదినాన కిక్కిరిసిపోయిన శివాలయాలు**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని శివాలయాలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. షాద్ నగర్ నియోజకవర్గం లోని అతిపెద్ద పుణ్యస్థలమైన రామేశ్వరంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులతో రద్దీగా ఉంది. వారం పాటు జరగబోయే బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఐ విజయ్ కుమార్, ఆధ్వర్యంలో ప్రతిష్ట భద్రత నిర్వహిస్తున్నారు. సిఐ విజయకుమార్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నేడు రేపు సుమారు లక్ష మంది భక్తులు ఈ దేవాలయాన్ని దర్శించుకుని అవకాశం ఉంది. కాబట్టి భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## అందే మోహన్‌తోనే సబండ వర్గాలకు న్యాయం

**చైర్మన్ పీఠం అందే మోహన్‌కే ఇవ్వాలి**

**ఏలికట్ట గ్రామ సర్పంచ్ నవ కిరణి, నరసింహ డిమాండ్**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 15:** అందే మోహన్ ను షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా నియమిస్తేనే సబండ వర్గాలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఎలి కట్ట గ్రామ సర్పంచ్ నవ కిరణి నరసింహ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ పీఠం అందే మోహన్‌కు ఇవ్వాలని స్పష్టంగా డిమాండ్ చేసిన నరసింహ, కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడుతూ ప్రజల సమస్యలపై పోరాటం చేసిన నాయకుడు మోహన్ అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకు పోయే స్వభావం అతనిది. సామాజికంగా వెనుకబడిన సబండ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటే సరైన వ్యక్తిని బాధ్యతల్లోకి తీసుకురావాలని, ముదిరాజ్ వర్గానికి చెందిన అందే మోహన్‌కు చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా సమానత్వానికి నిదర్శనం చూపవచ్చని అన్నారు. ఆలోచనాపరుడు, యువశక్తితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగల సామర్థ్యం ఉన్న నాయకుడు మోహన్ మాత్రమేనని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి పరుగులు పెట్టాలంటే విజన్ ఉన్న నాయకత్వం అవసరమని, అలాంటి విజన్ కలిగిన అందే మోహన్‌కు అవకాశం కల్పించాలని సూచించారు. సబండ వర్గాల ఆశలు నెరవేరేలా చైర్మన్ పదవి మోహన్‌కే దక్కాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సేక్రేడ్ హార్ట్ హై స్కూల్లో ఘనంగా 16వ వార్షికోత్సవ వేడుకలు

**● ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిషప్ సెక్రటరీ సగిలి ప్రకాష్ ఫాదర్**





**తొలి అక్షరం/ఖమ్మం, ఫిబ్రవరి 15 :** నగరంలోని దాన్వాయిగూడెం కాలనీలో సేక్రేడ్ హార్ట్ హై స్కూల్లో 16వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బిషప్ సెక్రటరీ సగిలి ప్రకాష్ ఫాదర్ , ఖమ్మం అర్బన్ సిఐ భాను ప్రకాష్ హాజరయ్యారు. ఈ యొక్క కార్యక్రమాన్ని బిషప్ సెక్రటరీ సగిలి ప్రకాష్ ఫాదర్ జ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల అభివృద్ధి పాఠశాల ఒక్కటే బాధ్యత కాదు కుటుంబం కూడా సమాన భాగస్వామి. తల్లిదండ్రులు పిల్లలకు టీచర్లను గౌరవించమని, శ్రద్ధగా చదవమని ప్రోత్సహించాలి. టీచర్లు ప్రేమతో, శ్రద్ధతో బోధించాలి. పరస్పర సహకారంతోనే పిల్లలు మంచి పౌరులుగా ఎదుగుతారు. మార్కులు ముఖ్యమే కానీ అవే అంతా కావు. వ్యక్తిత్వ వికాసం, విలువలు, నాయకత్వ లక్షణాలు కూడా అవసరం. పిల్లలను ఇతరులతో పోల్చకుండా, వారి ప్రతిభను ప్రోత్సహిద్దాం. మనమందరం కలిసి కృషి చేసి, మంచి విలువలతో కూడిన భావి భారత పౌరులుగా మన పిల్లలను తీర్చిదిద్దుకుందాం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్యాలు, గేయాలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకులను మెప్పించారు. పాఠశాలలో విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ స్టెఫీ మాట్లాడుతూ.. 16 సంవత్సరాల ప్రయాణంలో సంస్థ సాధించిన విజయాలను స్మరించుకుని, తల్లిదండ్రుల సహకారం మరియు ఉపాధ్యాయుల అంకితభావంతోనే ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉత్తమ విద్యా ప్రమాణాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ వేడుకలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# ఆధ్యాత్మిక శోభతో పులకించిన తొర్రూర్

**- తొర్రూర్ క్షేత్రంలో..**

**శివపార్వతుల కళ్యాణ వైభోగం**

**- కనులపండువగా సారంగేశ్వరుని వివాహ మహోత్సవం**

**- తరలివచ్చిన భక్తజనం..శివనామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో- తొర్రూర్ ప్రతినిధి(సాంబ పస్తం), ఫిబ్రవరి15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తొర్రూర్ పట్టణంలోని అత్యంత పురాతన, ప్రసిద్ధ శ్రీ పార్వతీ సమేత శ్రీ సారంగేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లింది. లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు నిర్వహించిన శివ-పార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. **లింగోద్భవ కాల పూజలతో ప్రారంభం:** ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత విశేషమైన లింగోద్భవ కాల అభిషేకాలను నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణ క్రతువును మొదలుపెట్టారు. స్వామి వారు, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి, వేదోక్తంగా వివాహ వేడుకను పూర్తి చేశారు. **ముత్యాల తలంబ్రాలు..భక్తకోటి పరవశం:** కళ్యాణ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ముత్యాల తలంబ్రాల వేడుక భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఓం నమః శివాయ అనే శంఖారావం మధ్య భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శన క్యూలైన్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించారు.

# పేదరికం, సంప్రదాయాలు కాదు భవిష్యత్ ముఖ్యం

**- బాల్య వివాహాలకు ముగింపు పలకండి**

**- డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు**







**తొలి అక్షరం/ఖమ్మం ఫిబ్రవరి 15 :** పేదరికం, సంప్రదాయాలు కాదు పిల్లల భవిష్యత్ ముఖ్యం అని, బాల్య వివాహాలకు ముగింపు పలకాలనీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు అన్నారు. జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేసుకోవాలని, అందుకు చదువు ఒక్కటే ఏకైక మార్గమని పేర్కొన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఎన్ఎస్పి క్యాంపు నందు 'బాల్ వివాహ ముక్త్ భారత్ రథయాత్ర' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ... బాల్య వివాహాలను నిరోధించడానికి 'బాల్య వివాహ నిరోధక చట్టం 2006' ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. అనాదిగా వస్తున్న ఈ సాంఘిక దురాచారాన్ని ఇకపై సహించవద్దని, దీనికి ముగింపు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పిల్లల తల్లిదండ్రులతో నిరంతరం మాట్లాడాలని, తమ కళాశాలలో, పాఠశాలలో జరిగే అన్ని విషయాల పట్ల తల్లిదండ్రులతోటి చర్చించాలని అన్నారు. అప్పుడే తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తారని, చదువుకుని స్థిరపడే వరకు వివాహ ఆలోచన రాకుండా ఉండే అవకాశం ఉందని అన్నారు. బాల్య వివాహం చేయడం వలన విద్యకు అంతరాయం కలగడంతోపాటు ఆరోగ్య సమస్యలు వస్తాయని, శారీరకంగా, మానసికంగా సిద్ధంగాలేని వయసులో గర్భధారణ వల్ల ప్రమాదాలు ఎక్కువ అవుతాయని అన్నారు. విద్య లేకపోవడం వల్ల మంచి ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాగే మహిళా సాధికారతకు వారి స్వప్నాలు, ఆశయాలకు అడ్డంకిగా నిలిచి జీవితాన్ని మధ్యలోనే ముగింపు పలుకుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. పేదరికం, అజ్ఞానం, సామాజిక వత్తుడి, సాంప్రదాయాలు బాల్యవివాహాలకు కారణాలు అవుతున్నాయని, ఆడపిల్లలు భారం కాదని హితవు పలికారు. పేదరికం, సాంప్రదాయాలతో పోరాడి బాల్యవివాహాలను నిరోధించాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని ఆయన నొక్కి వక్కాణించారు. గత రెండేళ్లుగా ఎయిడ్ సేవా సంస్థ ద్వారా చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఈ రథయాత్ర ద్వారా ఖమ్మం జిల్లాలోని ప్రతి ఒక్కరికి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించి, 2030 లోపే ఖమ్మం జిల్లాలో బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చడానికి పోలీసుశాఖ కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. మరో అతిథి బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ భారతరాణి మాట్లాడుతూ.. జిల్లాలో బాల్యవివాహాలను నిర్మూలించడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ కమిటీ, పోలీసు శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థల వారి సహాయ సహకారాలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక దాడులు, బాలల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యను ప్రోత్సహించడం ద్వారా బాలల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నామని స్పష్టం చేశారు. బాలికలు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. బాలల సమస్యలను చైల్డ్ లైన్టర్ అయినట్టుగా ఫోన్ చేసి తెలపాలన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ డైరెక్టర్ పిఎస్ఎస్ హరి ప్రసాదరావు మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాలుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యపేట జిల్లాలలో తమ సంస్థ ద్వారా బాల్యవివాహాల నిర్మూలనకు నిరంతరం వివిధ శాఖల సహాయ సహకారాలతో అవగాహన కార్యక్రమాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఆపరేషన్ స్మైల్ ముస్కాన్ నందు కీలక పాత్ర పోషిస్తున్నామని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు. జాతీయ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి 50 మంది ఆడపిల్లలు ఒకరికి బాల్య వివాహం జరుగుతుందని, 2030 లోపు బాల్యవివాహాలను 10 శాతంలోపు తగ్గించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ రథయాత్ర ఆదివారం నుంచి జిల్లాలో ఉన్న 21 మండలాలలో ప్రచారం చేస్తుందని, అవగాహన ద్వారానే బాల్యవివాహాలను నిర్మూలించవచ్చని, తల్లిదండ్రులు, ప్రజలు, అధికారులు సహకరిస్తే త్వరలోనే మనం బాల్య వివాహరహిత ఖమ్మం జిల్లాను చూడొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య అతిథి ప్రసాదరావు వారి చేతులమీదుగా రథయాత్రను ప్రారంభించి అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కొరకై ప్రచారానికి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ డైరెక్టర్ పిఎస్ఎస్ హరి ప్రసాదరావు, వాణి, కో-ఆర్డి నేటర్లు కె. శ్రీనివాస్, వి. రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ సత్య స్వరూపిణి, టీం సభ్యులు రాందాస్ రవిచంద్ర, రవీంద్ర భాస్కర్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎప్‌స్టీన్ వివాదంలోకి కపిల్ సిబల్- కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

: ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాద అంశంపై కాంగ్రెస్ – బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ వివాదం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశంలోనూ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అమెరికా విడుదల చేసిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరు కనిపించడంతో ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రధాని మోదీ పేరు కూడా ఉండటంతో మొన్నటి వరకు బీజేపీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అయితే తాజాగా ఈ వివాదంలో మాజీ కాంగ్రెస్ నేత వచ్చి చేరారు. దీంతో హస్తం పార్టీని బీజేపీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. దీంతో కమలం పార్టీ ఆరోపణలపై కూడా కాంగ్రెస్ అదే స్థాయిలో స్పందించింది. ఇంతకీ రెండు పార్టీల మధ్య జరిగిన మాటల యుద్ధాన్ని ఓసారి పరిశీలిద్దాం. 2010లో అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ నిధులతో కూడిన అవార్డును మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్ అందుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేసింది. ఈ అంశం గురించి సిబల్‌ను అడగ్గా వీటిని చెత్త ఆరోపణలుగా కొట్టిపారేశారు. కాంగ్రెస్ కూడా ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఆ కార్యక్రమానికి సిబల్ అతిథి కాదని స్పష్టం చేసింది. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ సర్కారులో కపిల్ సిబల్ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. విద్యలో ప్రపంచ స్థాయి సహకారానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆ అవార్డు లభించిందని కాంగ్రెస్ మీడియా విభాగాధిపతి పవన్ ఖేడా తెలిపారు. దీనికి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఎటువంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. కపిల్ సిబల్ 2022లో కాంగ్రెస్‌ను



వీడారు. ప్రస్తుతం ఆయన సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సోషల్ మీడియాలో బీజేపీ పోస్టుఅంతకుముందు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఎక్స్?లో పోస్టు చేశారు. ఎప్‌స్టీన్ సహకారంతో ఇచ్చిన అవార్డును గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కపిల్ సిబల్ అందుకున్నారని ఆ పోస్టులో పేర్కొన్నారు. కాంగ్రెస్ విదేశీ విభాగం అధిపతి శ్యామ్ పిట్రోడాకు కూడా ఇటువంటి వర్గాలతోనే సంబంధాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. సిబల్ ఆ అవార్డు అందిన కొద్ది కాలానికే, అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో అనేక విధానపరమైన మార్పులు చోటుచేసుకున్నాయని ప్రదీప్ భండారి ఆరోపించారు. ఇవి కేవలం యాదృచ్ఛికాలేనా?, లేక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ఎప్‌స్టీన్ వంటి బాహ్య శక్తులు ప్రయత్నించాయా? దీనికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూనే, "ఎప్‌స్టీన్ --- కాంగ్రెస్ వాలెంటైన్" అంటూ వ్యగ్యంగా ఆ పోస్టులో పేర్కొన్నారు. బీజేపీ మరో అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఇదే అంశంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. ఎప్‌స్టీన్‌తో కాంగ్రెస్ నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' ఎలాంటిది? ఎప్‌స్టీన్ నిధులు సమకూర్చిన ఐఐఈ నుంచి కపిల్ సిబల్ ఎందుకు అవార్డును స్వీకరించారు? అని ఆయన తన పోస్ట్‌లో ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి పార్లమెంటులో చాలా మాట్లాడటం ఇష్టం కదా? దీని గురించి ఇప్పుడు ఆయన ఏమైనా చెబుతారా? అని పూనావాలా ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎదురుదాడిబీజేపీ నేతల ట్వీట్లపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఎదురుదాడికి దిగారు. బీజేపీకి చెందిన ప్రదీప్ భండారి, షెహజాద్ పూనావాలా కలిసి కపిల్ సిబల్ పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని తప్పుడు ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ షేర్ చేసింది 59 పేజీల డాక్యుమెంట్ అని, అందులో కాన్ఫరెన్స్‌ల నుంచి ఫ్యాషన్ షోల వరకు అనేక కార్యక్రమాలను జాబితా చేశారన్నారు. కపిల్ సిబల్ పేరు 55వ పేజీలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్' కార్యక్రమం కింద ఉందన్నారు. కానీ బీజేపీ నేతలు అంత దూరం చదవడానికి ఇష్టపడలేదని, పేరు చూడగానే ఉత్సాహపడిపోయి, ప్రతిపక్షాలను ఈ గందరగోళంలోకి లాగాలని ఒక కట్టుకథను అల్లారని విమర్శించారు. తద్వారా తమ సొంత నేత హర్దీప్ సింగ్ పూరీ చుట్టూ అల్లుకున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని ఆరోపించారు.

## బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకారానికి ప్రధాని మోదీకి ఆహ్వానం



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీఎన్‌పీ (బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ) ఛైర్మన్ తారిక్ రహ్మాన్ త్వరలో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు . ఫిబ్రవరి 17న జరగనున్న ఈ కార్యక్రమానికి భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది . బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సలహాదారు ప్రొఫెసర్ మొహమ్మద్ యూనస్ ప్రధాని మోదీతో సహా 13 దేశాధినేతలను ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కాకపోవచ్చని తెలుస్తోంది. అదే రోజున ఫ్రాన్స్ అధ్యక్షుడితో కలిసి ప్రధాని మోదీ కొన్ని కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ వెళ్లకపోవచ్చని తెలిసింది. అయితే, ప్రధానికి బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ లేదా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది .భారత్‌తో పాటు చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ, యూఏఈ, ఖతర్, మలేషియా, బ్రూనై, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, భూటాన్ దేశాల అధినేతలకు బంగ్లాదేశ్ ప్రధాని ప్రమాణస్వీకారోత్సవానికి ఆహ్వానాలు అందాయి. పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజా భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తారిక్ రహ్మాన్‌తో దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఇది తమ దేశ చరిత్రలో ఓ కొత్త అధ్యాయమని బీఎన్‌పీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటులోని 299 స్థానాల్లో 212 సీట్లను బీఎన్‌పీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక జమాతే ఇస్లామీ పార్టీ 70 సీట్లలో, ఇతర స్వతంత్ర అభ్యర్థులు మిగిలిన స్థానాల్లో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇక బీఎన్‌పీకి చెందిన సీనియర్ హిందూ నేత గయేశ్వర్ కూడా ఈ ఎన్నికల్లో ఢాకా–3 నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించారు.

# 'ఉత్తర ప్రగల్భాలతో యుద్ధంలో విజయాలు వరించవు'- పాకిస్థాన్‌పై సీడీఎస్ చురకలు!

దాయాది పాకిస్థాన్‌పై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పరోక్ష విమర్శలు గుప్పించారు. కొన్ని దేశాలు ప్రగల్భాల ద్వారా విజయం సాధించామని భ్రమపడుతుంటాయని చురకలు అంటించారు. అలాంటి దేశాలకు విజయం ఎప్పటికీ వరించదన్నారు. శనివారం పుణెలో జరిగిన 'జై సే విజయ్ సెమినార్ ప్రారంభోత్సవంలో సీడీఎస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సీడీఎస్ నొక్కి చెప్పారు. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన దాడికి సమాధానంగా మే నెలలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని సీడీఎస్ గుర్తుచేశారు. పాకిస్థాన్ పేరును నేరుగా ఎత్తకుండానే దాయాది దేశానికి సీడీఎస్ కౌంటర్ ఇచ్చారు. కూలిపోయిన ఉగ్రవాద స్థావరాలు, ధ్వంసమైన రన్‌వేలు, పనికిరాని వైమానిక రక్షణ వ్యవస్థల మీద నిజమైన విజయాన్ని ఎప్పటికీ నిర్మించలేరని పాకిస్థాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాబోయే దశాబ్ద కాలంలో భారత రక్షణ రంగం ఎలాంటి సవాళ్లను ఎదర్కోబోతోందనే దానిపై సీడీఎస్ వివరించారు. మారుతున్న ప్రపంచంలో శాశ్వత మిత్రులు కానీ, శత్రువులు కానీ ఉండరని చెప్పుకొచ్చారు. ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే భారత్ మానసికగా, నిర్మాణపరంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేలా సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. భవిష్యత్ యుద్ధాలు అత్యంత పోటీతత్వంతో, అధునాతన సాంకేతికతతో కూడి ఉంటాయని, వాటిని ఎదుర్కోవడానికి కొత్త ఆలోచనలతో ముందుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాల



మధ్య భాగస్వామ్యాలు అవసరమే కానీ, అవి దేశ సొంత సామర్థ్యానికి ప్రత్యామ్నాయం కాకూడదని వ్యాఖ్యానించారు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కోసం దేశీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. "విజయం అనేది కేవలం వాక్చాతుర్యం వల్ల వరించదు. మన పొరుగున ఉన్న కొన్ని దేశాలు కేవలం మాటలతో విజయాన్ని ప్రకటించుకున్నాయి. కానీ విజయం అనేది 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మనం ప్రదర్శించినట్లుగా సాక్ష్యాధారాలతో నిరూపితమవ్వాలి. ధ్వంసమైన ఉగ్రవాద శిబిరాలు, దెబ్బతిన్న రన్‌వేలు, నిర్వీర్యమైన విమానశ్రయాలు, పనికిరాని వైమానిక రక్షణ వ్యవస్థల మీద విజయాన్ని నిర్మించలేరు. ఇటువంటి విజయాలు ఎంతో కాలం నిలవవు. రాబోయే దశాబ్ద కాలం కోసం భారత రక్షణ వ్యవస్థను, భవిష్యత్తులో మన ముందున్న సవాళ్లను నిశితంగా అంచనా వేయాలి. రాబోయే కాలం మరింత పోటీతత్వం, సాంకేతికంగా విచ్ఛిన్నకరంగా మారబోతోందని నేను నమ్ముతున్నాను" అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో పాకిస్థాన్ ఎయిర్ బేస్‌లు, రన్ వేలు ధ్వంసమయ్యాయి. కానీ, పాకిస్థాన్ మాత్రం తమ వైఫల్యాన్ని ఒప్పుకోలేదు. పైగా భారత దాడులను తిప్పికొట్టామని భారత్‌కు భారీ నష్టం చేకూర్చామని పాక్ మీడియాలో ఆ దేశ ఆర్మీ, ప్రభుత్వ పెద్దలు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. భారత్ తన వైమానిక దాడుల వీడియోలను, శాటిలైట్ చిత్రాలను సాక్ష్యాలుగా చూపినా పాక్ ప్రభుత్వం అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది. తమ దేశపు రక్షణ వ్యవస్థ విఫలమైందనే నిజాన్ని దాచిపెట్టి, కేవలం భావోద్వేగపూరిత ప్రసంగాల ద్వారా అక్కడి ప్రజలను రెచ్చగొట్టి వారి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నించింది. ఇప్పటికీ పాకిస్థాన్ అలాంటి కామెంట్స్ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో పాకిస్థాన్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ఎండగట్టేందుకే సీడీఎస్ చౌహాన్ తాజాగా కౌంటర్ ఇచ్చారు. ఇదిలా ఉండగా, భారత్– చైనా సరిహద్దు వివాదాలు, టిబెట్ అంశంపై కూడా శుక్రవారం సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడారు. ఈ అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టిబెట్ విషయంలో దశాబ్దాల క్రితమే భారత్ తీసుకున్న నిర్ణయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం 1954లోనే టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించిందన్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన చారిత్రక 'పంచశీల ఒప్పందం'లో కూడా ఈ అంశం ప్రస్తావన ఉందని ఆయన గుర్తుచేశారు.

## మాది మానవ కులం కులరహిత గ్రామంగా సౌందలా ఏకగ్రీవ తీర్మానం



**మహారాష్ట్ర :** మహారాష్ట్ర లోని అహల్యానగర్ (అహ్మద్ నగర్) జిల్లాలో ఉన్న సౌందలా గ్రామ పంచాయతీ సంచలన తీర్మానాన్ని ఆమోదించింది. సౌందలాను కులరహిత గ్రామంగా ప్రకటించింది. 'మా అందరిది మానవ కులం' అని గ్రామస్థులు నినదించారు. ఫిబ్రవరి 5న ఉదయం ఈ ఊరిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కుల,మతాలకు అతీతంగా గ్రామస్థులంతా పెద్దసంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. ఆ వెంటనే గ్రామ సర్పంచ్ శరద్ అర్గాడే కీలక ప్రకటన చేశారు. కులమతాలకు అతీతంగా మనుషులందరి రక్తం ఎరుపు రంగులోనే ఉన్నందున, ఊరిని కులరహితంగా మారుద్దామని వెల్లడించారు. ఈమేరకు ప్రతిపాదనతో ఆయన ప్రవేశపెట్టిన తీర్మానంపై గ్రామ పంచాయతీ ఆమోద ముద్ర వేసింది. దీనిపై పూర్తి వివరాలతో 'ఈటీవీ భారత్' గ్రౌండ్ రిపోర్ అంటరానితనం, కుల వివక్షపైనే మా పోరాటం"సౌందలాను కులరహిత గ్రామంగా ప్రకటించాం. స్థానిక మరాఠీ భాషలో నేను ప్రవేశపెట్టిన తీర్మానానికి ఫిబ్రవరి 5న గ్రామసభ, సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థుల ఏకగ్రీవ మద్దతు లభించింది. మతపరమైన ఘర్షణలను ఆపడానికి, శాంతి సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, కుల వివక్షపై పోరాడటానికి, మానవ హక్కుల ఉల్లంఘనను నిలువరించడానికి ఈ నిర్ణయాన్ని తీసుకున్నాం. అంటరానితనం అనే దానికి తావు ఉండకూడదు. ప్రజల మధ్య సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాన్ని పెంపొందించడమే మా లక్ష్యం. భారత రాజ్యాంగ ప్రవేశిక కూడా దేశ ప్రజల నుంచి ఇవే ఆశిస్తోంది. రాజ్యాంగ ప్రవేశిక నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు మా గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చారు. అందరిదీ మానవ కులమే అని తీర్మానించారు. మా తీర్మానాన్ని తదుపరిగా మహారాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నాం" అని సర్పంచ్ శరద్ అర్గాడే 'ఈటీవీ భారత్'కు తెలిపారు.

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం డీకే



**కర్ణాటకు:** సిద్ధరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంతకాలంగా బయటపడని వివాదం కొనసాగ ుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో సీఎం సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉంద ేనే ప్రచారానికి చెక్ పెట్టే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలననువిజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సంద ర్భంగా సీఎం విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టంచేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ.. ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచిపోతారని అన్నారు. విగ్రహావిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లోచర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడంపట్ల హర్షం వ్యక్తంచేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం పదవి రేసులో పోటీ పడుతున్న ఈ ఇద్దరు ఇలాంటి ఐక్యతను చూపడంరాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది.


# '2021లో డీఎంకే ఓడిన సీట్లను మాకు ఇవ్వాలి- అధికారంలో వాటా కూడా కావాలి'- స్టాలిన్ వ్యాఖ్యల వేళ కాంగ్రెస్ డిమాండ్

**తమిళనాడు:** ప్రభుత్వ అధికారంలో తమకు వాటా కావాలని మరోసారి కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 2021లో జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే ఓడిపోయిన సీట్లను మాత్రమే తాము కోరుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు విరుద్‌నగర్ ఎంపీ, కాంగ్రెస్ అగ్రనాయకుడు మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. కాగా, తమిళనాడుకు సంబంధించినంత వరకు అధికారంలో వాటా అనేది సాధ్యపడదని ఇటీవలే ఓ కార్యక్రమంలో డీఎంకే నాయకుడు, సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. అంతలోనే అధికారంలో వాటా కోసం కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ మరోసారి డిమాండ్ చేయడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారంలో వాటా తప్పనిసరిఈ ఏడాది జరగబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే 170 స్థానాల్లో పోటీ చేస్తుందని రాష్ట్ర మంత్రి రాజా కన్నప్పన్ ఫిబ్రవరి 13న మదురైలో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. అందులో 160 సీట్లలో డీఎంకే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2021లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓడిపోయిన



సీట్లనే తమ పార్టీ అడుగుతోందని అన్నారు.' '2021లో మీరు (డీఎంకే) 173 సీట్లలో పోటీ చేసి 133 స్థానాల్లో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో డీఎంకే గెలవని సీట్లను మేము (కాంగ్రెస్) కోరుతున్నాం. అధికార భాగస్వామ్యం కూడా కావాలి. అధికారంలో వాటా మా పార్టీ హక్కు. ప్రజలే ఆ విషయాన్ని నిర్ణయిస్తారు" అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దానికి మంత్రి రాజకన్నప్పన్ మాట్లాడిన వీడియోను అటాచ్ చేశారు. అధికారంలో వాటా డిమాండ్ చేస్తున్న కాంగ్రెసతమిళనాడులో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈసారి తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని డీఎంకేను కోరుతోంది. అలాగే ఎన్నికల తర్వాత అధికారంలో కూడా తమకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇదే విషయంపై డీఎంకే చీఫ్, ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ఓ కార్యక్రమంలో స్పందించారు. అధికారంలో వాటా అనే వాదన తమిళనాడుకు సరిపోదని, ఆ విషయం డీఎంకే, కాంగ్రెస్‌కు తెలుసన్నారు. మధ్యలో ఉన్న కొందరు కూటమిని చీల్చేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రచారమని వ్యాఖ్యానించారు. దీన్ని కూటమిని బలహీనపరచే ప్రయత్నంగా కొట్టిపారేశారు. అలాగే కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని కూడా స్టాలిన్ ఖండించారు. డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్యలు లేవని, పరస్పర అవగాహనతోనే ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తమిళనాడు ఎప్పటి నుంచో స్వయం ప్రతిపత్తి, కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ఇక్కడ అధికార భాగస్వామ్యం అనే భావనకు స్థానం లేదని, కూటమిలోని మిత్రపక్షాలన్నీ దీన్ని అంగీకరించాయని చెప్పారు.

## మెట్రో స్లాబ్ కూలిన ఘటనలో ఐదుగురు అరెస్ట్.. కాంట్రాక్టర్లకు రూ.6 కోట్లు జరిమానా




**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మెట్రో స్లాబ్ కూలిన సంఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేసింది. ఈ ప్రాజెక్టులో పాల్గొన్న కాంట్రాక్టర్లకు రూ. 6 కోట్ల జరిమానా విధించింది. (నిర్మాణ సంస్థకు చెందిన ఐదుగురిని పోలీ సులు అరెస్ట్ చేశారు. శనివారం మధ్యాహ్నం ములుం డ్‌లోని ఆర్టరీ ఎల్‌బిఎస్ మార్గ్‌లో నిర్మాణంలో ఉన్న మెట్రో లైన్ స్లాబ్ ఊడింది. రోడ్డుపై వెళ్తున్న ఆటో, ఒక కారుపై ఆ భారీ స్లాబ్ పడింది. ఒక వివాహానికి వెళ్తున్న స్థానిక సమాజ్‌వాదీ పార్టీ నేత, గ్రామ పెద్ద రామ్‌ధన్ యాదవ్ ఈ ప్రమాదంలో మరణిం చారు. మరో ముగ్గురు గాయపడ్డారు. కాగా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి మంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ సంఘటనపై సీరియస్‌గా స్పందించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యజీత్ సాల్వే ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అలాగే యాదవ్ కుటుంబానికి పరిహారాన్ని రూ. 15 లక్షలకు పెంచినట్లు షిండే వెల్లడించారు.

# రష్యా చమురు దిగుమతులను భారత్ నిలిపివేస్తుందా

రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందంటూ అమెరికా ప్రకటించిన నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా స్పందించారు. వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉన్న అంశాల్లో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడమే భారత దేశ విధానమని మంత్రి స్పష్టం చేశారు . జర్మనీలోని ప్రస్తుతం జరుగుతున్న మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోళ్లపై విలేకరులు ఆయనను ప్రశ్నించారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందా? అని ప్రశ్నించారు. ఇది దేశ వ్యూహాత్మక నిర్ణయాలపై ప్రభావం చూపుతుందా? అని అడిగారు. ఈ ప్రశ్నలకు మంత్రి జైశంకర్ స్పందిస్తూ ఇంధన కొనుగోళ్ల అంశం సంక్లిష్టమైనదని అన్నారు. ఇతర దేశాల్లోని సంస్థల వలెనే భారతీయ ఇంధన కంపెనీలు కూడా తమ



ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. ధరలు, ఇంధన లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇక భారత్ ఎల్లప్పుడూ పూర్తి స్వాతంత్ర్యంతో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. భారత దేశ చరిత్ర చూస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం స్పందించారు. రష్యా కొనుగోళ్లను నిలిపివేస్తామంటూ భారత్ తమకు హామీ ఇచ్చిందని అన్నారు. ఈ దిశగా ఐరోపా దేశాలు ఇప్పటికే చర్యలు తీసుకున్నాయని అన్నారు. మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన ఈ కామెంట్స్ చేశారు.




## నాకు వర్షం సినిమాలాగే అనిపిస్తుంది


ప్రస్తుతం చిన్న సినిమాలు థియేటర్లలలో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక వాలెంటైన్స్ వీక్ సందర్భంగా ఈ వారం మొత్తం చిన్న చిత్రాల హవా నడుస్తోంది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు అలాంటి ఓ చిన్న సినిమా గురించి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆసక్తికర పోస్ట్ చేశారు. తనకు వర్షం సినిమా ఎలాగో.. అలాగే యంగ్ హీరోకు ఈ సినిమా అలాగే అంటూ రాసుకొచ్చారు. అసలు విషయానికి వస్తే.. యంగ్ హీరో సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ కపుల్ ఫ్రెండ్లీ. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత ఈ హీరో నటించిన ఈ సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ అయ్యింది. ఈ సినిమాకు యూత్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. జీవితంలో ఎలాంటి ఆశలు లేని ఓ కుర్రాడి జీవితంలోకి ఓ అమ్మాయి రావడం.. ఆ అమ్మాయితో ఒకే ఇంట్లో గడపాల్సి రావడం.. తర్వాత ఇద్దరి జీవితాల్లోకి ఎలాంటి పరిస్థితులు వచ్చాయి అనేది సినిమా.తాజాగా ఈ మూవీపై ప్రశంసలు కురిపించారు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. "ఇదొక లవ్లీ, బ్యూటీఫుల్ ఫిలిం. కపుల్ ఫ్రెండ్లీ సినిమాను చాలా ఎంజాయ్ చేశాను. సంతోష్, మానస వారణాసి జోడి వండర్ ఫుల్ గా ఉంది. అశ్విన్ ఎంతో ప్రతిభావంతంగా సినిమాను తెరకెక్కించాడు. ఇలాంటి కథలను వెండితెరపైకి తీసుకువచ్చినందుకు అజయ్, యువీ క్రియేషన్స్ టీమ్ మొత్తానికి అభినందనలు. నాకు వర్షం సినిమా ఎలాగో.. మై డియర్ సంతోష్ శోభన్ కు కపుల్ ఫ్రెండ్లీ అలా అవుతుంది" అంటూ రాసుకొచ్చారు ప్రభాస్. ఇప్పుడు డార్లింగ్ చేసిన ఈ పోస్ట్ ఈ చిత్రానికి బూస్టప్ లా పనిచేస్తుంది.సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషలలో నిర్మించిన ఈ చిత్రానికి ఆదిత్య రవీంద్రన్ సంగీతం అందించారు. ఇందులో మానస వారణాసి కథానాయికగా నటించింది. ఈ చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేశారు.



## లిజార్డ్ టెక్స్చర్ లెదర్ జాకెట్‌లో సల్మాన్ ఖాన్ లుక్ అదుర్స్

ఆ ఒక్క జాకెట్ ధరతో మన దేశంలో ఒక లగ్జరీ ఎస్‌యూవీ (ﺭﺎﺨﮭ) కారును కొనేయవచ్చు. కేవలం బ్రాండ్ పేరు కోసమే కాకుండా, దాని తయారీలో వాడిన మెటీరియల్, దాని డిజైన్ ఇప్పుడు ఫ్యాషన్ వరల్డ్ లో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ధరించిన ఆ అల్ట్రా-లగ్జరీ జాకెట్ విశేషాలేంటో చూద్దాం.కారు కంటే ఖరీదైన జాకెట్..ఇటీవల జరిగిన వెరైటీ మ్యాగజైన్ లాంచ్ ఈవెంట్ లో సల్మాన్ ఖాన్ తన లుక్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన ధరించిన 'బ్రియోని' ఎంబాస్డ్ లెదర్ జాకెట్ ధర సుమారు రూ. 62,30,100 రూపాయలు. అంటే అక్షరాలా అరకోటి కంటే ఎక్కువే! భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన టయోటా ఫార్చ్యూనర్ టాప్ మోడల్ ధర కంటే ఈ జాకెట్ ఖరీదు ఎక్కువ కావడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "ఒక మనిషి ఫార్చ్యూనర్ కారును ఒంటిపై వేసుకుని తిరుగుతున్నాడు" అంటూ ఫ్యాన్స్ కామెంట్లతో రచ్చ చేస్తున్నారు.బ్రియోని బ్రాండ్ ప్రత్యేకత..ఇటలీకి చెందిన బ్రియోని అనేది ప్రపంచంలోని టాప్ లగ్జరీ బ్రాండ్లలో ఒకటి. సాధారణంగా హాలీవుడ్ స్టార్స్, వివిధ దేశాల అధ్యక్షులు ఈ బ్రాండ్ వస్తువులను ధరిస్తుంటారు. ఇది 'క్వైట్ లగ్జరీ' అనే కాన్సెప్ట్ మీద నడుస్తుంది. అంటే దీని మీద పెద్ద పెద్ద లోగోలు కనిపించవు కానీ, దీని నాణ్యత, తయారీ విధానం చూస్తేనే అది ఎంతటి ఖరీదైనదో అర్థమవుతుంది. సల్మాన్ ఖాన్ ధరించిన ఈ జాకెట్ ప్రీమియం కాఫ్ లెదర్ తో తయారైంది. ఈ జాకెట్ పై ఉన్న లిజార్డ్-స్కిన్ ఎంబాస్డ్ (పెద్ద బల్లి లేదా క్రాకడైల్ టెక్స్చర్ లాంటి) ఫినిష్ దీనికి ఒక రాయల్ లుక్ ఇచ్చింది. చాలా దృఢంగా, మగతనాన్ని ఉట్టిపడేలా చేసే ఈ డిజైన్ కు గోల్డ్ జిప్స్ మరియు బటన్స్ అదనపు ఆకర్షణగా నిలిచాయి. సాధారణంగా సల్మాన్ ఖాన్ డార్క్ కలర్స్ ను ఎక్కువగా ఇష్టపడతారు. ఈ నలుపు రంగు లెదర్ జాకెట్ ఆయన పర్సనాలిటీకి పర్ఫెక్ట్ గా సెట్ అయ్యింది.'బాప్ ఆఫ్ బాలీవుడ్ స్టైల్'..సల్మాన్ ఖాన్ లేటెస్ట్ ఫోటోలు వైరల్ కావడంతో ఇంటర్నెట్ లో ఆయన స్వాగ్ పై చర్చ మొదలైంది. "స్టైల్ లో ఆయనకు ఆయనే సాటి.. బాప్ ఆఫ్ బాలీవుడ్ స్టైల్" అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కేవలం సినిమా ప్రమోషన్ల కోసమే కాకుండా, పర్సనల్ లైఫ్ లో కూడా సల్మాన్ ఇంతటి ఖరీదైన వస్తువులను వాడటం ఆయన హోదాను తెలియజేస్తోంది. గతంలోనూ సల్మాన్ ఖాన్ వాడిన వాచీలు కోట్ల రూపాయల ధర పలికాయి.ఇప్పుడు ఈ రూ. 62 లక్షల జాకెట్ ఆ లిస్టులో చేరిపోయింది. గానే ఉంటుంది. ఒకప్పుడు కేవలం ఫిట్‌నెస్ తో ట్రెండ్ సెట్ చేసిన భాయ్.. ఇప్పుడు తన అల్ట్రా-లగ్జరీ ఫ్యాషన్ తో యువతను ఆకట్టుకుంటున్నారు. రూ. 62 లక్షల విలువైన జాకెట్ ధరించి ఆయన ఇచ్చిన ఫోజులు చూస్తుంటే.. బాలీవుడ్ సుల్తాన్ రేంజ్ ఏంటో మరోసారి స్పష్టమైంది. వస్తువు ఏదైనా అది సల్మాన్ ఖాన్ వేసుకుంటే వచ్చే ఆ కిక్కే వేరు అంటున్నారు అభిమానులు.

## ఒక్క మూవీతో రూ.200 కోట్లు కొల్లగొట్టిన హీరోయిన్.



సినీరంగంలో సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాని తారలు చాలా మంది ఉన్నారు. అలాగే హిట్స్ అందుకున్నప్పటికీ అవకాశాలు రాని హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న బ్యూటీ సైతం తెలుగులో ఫేమస్. ఇటీవలే రూ. 200 కోట్లు కొల్లగొట్టింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసుకుందామా.తెలుగులో ఆమె చేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అయినప్పటికీ ఆశలు మాత్రం వదలుకోలేదు. చాలా కాలం తర్వాత ఇటీవలే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆమె నటించిన సినిమా ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇంతకీ ఆమె ఎవరంటే.. తెలుగులో ఆమె చేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అయినప్పటికీ ఆశలు మాత్రం వదలుకోలేదు. చాలా కాలం తర్వాత ఇటీవలే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆమె నటించిన సినిమా ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇంతకీ ఆమె ఎవరంటే..టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కేరళ కుట్టి. కానీ ఇప్పటివరకు తెలుగులో సరైన హిట్టు మాత్రం అందుకోలేదు. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కేరళ కుట్టి. కానీ ఇప్పటివరకు తెలుగులో సరైన హిట్టు మాత్రం అందుకోలేదు. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ.ఈ సినిమా నిరాశ పరిచినప్పటికీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో ఆమె చేసిన సినిమాలు అంతగా మెప్పించలేకపోయాయి. ఇక ఇటీవల కొత్త లోక సినిమాతో ఈ ముద్దుగుమ్మ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా నిరాశ పరిచినప్పటికీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో ఆమె చేసిన సినిమాలు అంతగా మెప్పించలేకపోయాయి. ఇక ఇటీవల కొత్త లోక సినిమాతో ఈ ముద్దుగుమ్మ భారీ విజయాన్ని అందుకుంది.డిఫరెంట్ కథతో వచ్చిన ఈ సినిమా రూ. 100 కోట్లకు పైగానే వసూలు చేసింది. ఒక్క సినిమాతోనే అటు మలయాళం, ఇటు తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. డిఫరెంట్ కథతో వచ్చిన ఈ సినిమా రూ. 100 కోట్లకు పైగానే వసూలు చేసింది. ఒక్క సినిమాతోనే అటు మలయాళం, ఇటు తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో అవకాశం కోసం వెయిట్ చేస్తుంది.ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కళ్యాణి.. తాజాగా బ్లాక్ డ్రెస్ లో స్టన్నింగ్ స్టిల్స్ షేర్ చేసింది. గ్లామరస్ ఫోజులతో మతిపోగొట్టే అందాలతో కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కళ్యాణి.. తాజాగా బ్లాక్ డ్రెస్ లో స్టన్నింగ్ స్టిల్స్ షేర్ చేసింది. గ్లామరస్ ఫోజులతో మతిపోగొట్టే అందాలతో కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.

## ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఒక్క సినిమాతోనే సెన్సేషన్

సాధారణంగా సినీ ప్రపంచంలో సరైన గుర్తింపు రావడం అంత సులభం కాదు. తక్కువ సమయంలోనే



ఓవర్ నైట్ స్టార్ డమ్ తెచ్చుకుని.. తర్వాత అదే క్రేజ్ కొనసాగించిన తారలు చాలా తక్కువ మంది. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం రాత్రికి రాత్రే సెన్సేషన్ అయిపోతుందటారు. ఆ తర్వాత మాత్రం ఇండస్ట్రీలోనే కనిపించకుండా పోతారు.పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడును గుర్తుపట్టారా.. ? తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. గ్లామర్ సెన్సేషన్ బ్యూటీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మడును గుర్తుపట్టారా.. ? తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. గ్లామర్ సెన్సేషన్ బ్యూటీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది.అలాగే అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా ఉండడం లేదు. కానీ ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా చేతిలో గులాబీలతో ఫోటోలకు ఫోజిలిచ్చింది. ఇంతకీ ఈ ముద్దుగుమ్మ ఎవరా అని ఆలోచిస్తున్నారా.. ? తనే హీరోయిన్ నేహా శెట్టి. అలాగే అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా ఉండడం లేదు. కానీ ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా చేతిలో గులాబీలతో ఫోటోలకు ఫోజిలిచ్చింది. ఇంతకీ ఈ ముద్దుగుమ్మ ఎవరా అని ఆలోచిస్తున్నారా.. ? తనే హీరోయిన్ నేహా శెట్టి.మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించింది. కానీ ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మాత్రం డీజే టిల్లు. మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించింది. కానీ ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మాత్రం డీజే టిల్లు.న్నలగడ్డతో చేసిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఈ మూవీతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇందులో లుక్స్ తోపాటు గ్లామర్ బ్యూటీగానూ కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. సిద్ధు జొన్నలగడ్డతో చేసిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఈ మూవీతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇందులో లుక్స్ తోపాటు గ్లామర్ బ్యూటీగానూ కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. కానీ అలా జరగలేదు. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న నేహా.. ఇటీవల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ థియేటర్లలో మాత్రం ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్ తొలగించి చివరకు యూట్యూబ్ లో రిలీజ్ చేసింది చిత్రయూనిట్. కానీ అలా జరగలేదు. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న నేహా.. ఇటీవల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ థియేటర్లలో మాత్రం ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్ తొలగించి చివరకు యూట్యూబ్ లో రిలీజ్ చేసింది చిత్రయూనిట్.

## ఆ సినిమాకు వెళ్లి ఇంటర్వెల్ కే దండం పెట్టి వచ్చేసా...

దర్శకుడు ఎస్.వి. కృష్ణారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ చాలా కాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సినిమాపై తన విశిష్టమైన ఆలోచనలను, ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పోకడలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. కృష్ణారెడ్డి క్లెన్సెడ్ ఫిల్మ్స్ అనే తన నూతన బ్యానర్‌ను పరిచయం చేసినట్లు తెలిపారు. దీని అర్థం శుద్ధి చేయబడిన చిత్రాలు అని అన్నారు. గతంలో మనీషా ఫిల్మ్స్ పేరుతో సినిమాలు నిర్మించిన ఆయన, ఇప్పుడు కేవలం క్లీన్, కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రాలనే నిర్మిస్తానని స్పష్టం చేశారు. నేటి సినిమాల్లో సర్వసాధారణమైన అశ్లీలత, డబుల్ మీనింగ్ డైలాగ్‌లు, యు/ఎ సర్టిఫికేట్ పొందిన చిత్రాల్లో సైతం అభ్యంతరకర సన్నివేశాలు ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఒక ఫిల్మ్‌మేకర్‌గా, ఆయన సినిమాను చూసే విధానం ఇతరులకంటే భిన్నంగా ఉంటుందని వివరించారు. తన సినిమాల్లో అబ్సర్డిటీ (అసంబద్ధత) లేదా డబుల్ మీనింగ్ డైలాగ్‌లు ఉండవని ఆయన స్పష్టం చేశారు. నటీమణుల దుస్తుల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటానని, అనుకోకుండా పైట చెంగు తొలగినా, నేరుగా ఆర్టిస్టుకు చెప్పకుండా కో-డైరెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ ద్వారా సరిచేయిస్తానని తెలిపారు. ఇలాంటి క్లీన్ సినిమా దృక్పథంతోనే తాను కొనసాగుతానని కృష్ణారెడ్డి చెప్పారు.



## చనిపోయే 6 రోజుల ముందు ఉదయ్ కిరణ్ ఫోన్‌లో మాట్లాడాడు



దర్శకుడు వి.ఎన్.ఆదిత్య గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దివంగత నటుడు ఉదయ్ కిరణ్‌తో తనకున్న రిలేషన్‌ను, అతడితో మాట్లాడిన చివరి మాటలు, శ్రీరామ్ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. శ్రీరామ్ చిత్రం విషయంలో రావాల్సినంత విజయం దక్కలేదని ఆదిత్య అభిప్రాయపడ్డారు. మనసంతా నువ్వే సినిమా విజయం తర్వాత ఉదయ్ కిరణ్‌కు వచ్చిన క్రేజ్ కారణంగా శ్రీరామ్ వంటి యాక్షన్ చిత్రానికి అంచనాలు వేరేలా ఉంటాయని ముందుగానే పోస్టర్ల విషయంలో తాను సూచించానని తెలిపారు. అయితే, మొహబ్బతే తరహా పోస్టర్లను విడుదల చేయడం, సినిమా యాక్షన్ జానర్‌కు విరుద్ధంగా ఉండటం తనను నిరాశపరిచిందని చెప్పారు.శ్రీరామ్ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణ విడుదలకు ముందే టేబుల్ ప్రాఫిట్స్ పొందడం వల్ల సినిమా పబ్లిసిటీపై ఆసక్తి చూపించలేదని ఆదిత్య వివరించారు. అటు మనసంతా నువ్వే నిర్మాత ఎం.ఎస్.రాజు సినిమా విజయం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రమోషన్ల కోసం ఖర్చు చేస్తే లాభాలు తగ్గుతాయని నిర్మాత అనడంతో, తాను, ఉదయ్ కిరణ్ కలిసి ప్రచారం చేద్దామన్నా కూడా ఫలితం లేకపోయిందని ఆదిత్య పేర్కొన్నారు. ఇది సినిమా విజయానికి అడ్డంకిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఉదయ్ కిరణ్ ఆత్మహత్యపై తనకు బాధ కంటే కోపమే ఎక్కువని ఆయన స్పష్టం చేశారు. ఆత్మహత్య అనేది బలహీనమైన చర్య అని, ఎంత దీనమైన స్థితిలో ఉన్నా జీవితం కంటే ఏదీ గొప్పది కాదని ఆయన చెప్పారు.